ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

బుధవారం 10 సెప్టెంబరు 2025

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

అనకాపల్లి అగ్రికల్చర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అనకాపల్లి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రాగి పైరులో అగ్గి తెగులు, చెరకు పైరులో ముప్పుకుళ్లు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

బీఎన్ రోడ్డు బాగుపడేదెన్నడో?

చెరువును తలపిస్తున్న చోడవరం- విశాఖ, అనకాపల్లి రోడ్డు

- అడుగడుగునా గోతులతో అధ్వానం
- రెండు నెలల క్రితం పలు చోట్ల గ్రావెల్, కాంక్రీట్‌తో గోతులు పూడ్చివేత
- తాజా వర్షాలకు కొట్టుకుపోయి పూర్వ స్థితికి..
- ఇటుగా ప్రయాణించాలంటే వాహనచోదకులు బెంబేలు
- కాంట్రాక్టర్‌కు కోర్టు ఇచ్చిన గడువు మరో 11 రోజులతో పూర్తి
- ఇప్పటికీ ఒక్క గుంత కూడా పూడ్చని వైనం

చోడవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): **బీఎన్ రోడ్డులో ప్రయాణమంటే వాహనచోదకులు హడలెత్తిపోతున్నారు. ఇప్పటికే గోతులతో ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డు ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మరింత దారుణంగా తయారైంది. రెండు నెలల క్రితం గ్రావెల్, కాంక్రీట్ మిశ్రమంతో గోతులను పూడ్చగా, తాజాగా కురుస్తున్న వర్షాలకు అవి కొట్టుకుపోయి ఈ రోడ్డు పూర్వ స్థితికి వచ్చింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.**



పట్టణంలోని కొత్తూరు జంక్షన్ వద్ద చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి



వెంకన్నపాలెం జంక్షన్ వద్ద రోడ్డు దుస్థితి



చోడవరం- అనకాపల్లి రోడ్డులో గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఘోరంగా ఉన్న ప్రధాన రహదారి

ప్రస్తుతం చోడవరం నుంచి అనకాపల్లి, విశాఖపట్నం మార్గంలో వెంకన్నపాలెం వరకు రోడ్డు దారుణంగా ఉంది. ప్రధానంగా స్థానిక కొత్తూరు జంక్షన్‌లో అయితే రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. ఇక గోవాడ, అంబేరుపురం, వెంకన్నపాలెం జంక్షన్‌ల వద్ద రోడ్డు ఆనవాళ్లు లేకుండాపోయింది. అటు అల్లూరి జిల్లా, ఇటు ... మిగతా 8వ పేజీలో

అధ్వానంగా చోడవరం- చీడికాడ ప్రధాన రహదారి

బీఎన్ రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే చోడవరం నియోజకవర్గ కేంద్రం నుంచి చీడికాడ మండలానికి వెళ్లే ప్రధాన రహదారి సైతం స్థానిక ఐటీఐ కాలనీ వద్ద ఘోరంగా దెబ్బతిన్నది. వడ్డాది, విజయరామరాజుపేటల వద్ద కాజ్‌వేలు దెబ్బతినడంతో ఏజెన్సీ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు మాడుగుల, చీడికాడ మీదుగా చోడవరం వస్తున్నాయి. అలాంటి కీలకమైన ఈ రోడ్డు కూడా ఘోరంగా తయారుకావడంతో వాహనదారులకు ఎటూ పాలుపోవడం లేదు. ప్రధానమైన ఈ రహదారులు ధ్వంసంతో తాము ఎంతకాలం ఈ కష్టాలు పడాలని, ఇప్పటికైనా తమ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



చోడవరం- చీడికాడ రోడ్డులో ఐటీఐ కాలనీ వద్ద ప్రధాన రహదారి పరిస్థితి

సింహాచలం సిరి గల్లంతు!

భక్తులు ఇచ్చిన 111.38 గ్రాముల బంగారు ముత్యాలహారంలో మిగిలింది 36 గ్రాములే

- అప్పన్న మ్యూజియంలోనూ అపచారం
- 10 బంగారు గొలుసు ముక్కలు మాయం
- బరువు 6.2 గ్రాములు
- లెక్కాపత్రం లేని నిర్వహణ...నిర్లక్ష్యం
- ఉప ఆలయాల్లో ఆభరణాలకు ఆపద
- వెండి వస్తువులను పూజకు వాడతారు
- కానీ, వాటిని ఎక్కడా నమోదు చేయరు
- ఇలాంటివి 16 వెండి వస్తువులున్నట్టు గుర్తింపు
- వాటి బరువు 9.464 కిలోలు
- నివేదిక ఇచ్చి ఆరు నెలలైనా చర్యలు పూజ్యం..
- మళ్లీ మరో ఐదుగురితో కమిటీ నియామకం
- నాలుగు నెలలైనా విచారణ పేరుతో నాన్చుడు ధోరణి



సింహాచలంలో మాయమైంది ఈ వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన ముత్యాలహారమే...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం దేవస్థానంలోని ఆభరణాలకు ఆపద వచ్చింది. లెక్కాపత్రం లేని దేవస్థానం నిర్వహణ, నిర్లక్ష్యంపై ఆరు నెలల క్రితమే నివేదిక అమరావతికి చేరినా, ఇంతవరకూ చర్యలు లేవు. దేవస్థానంలోని ఉప ఆలయాల్లో కొన్ని ఆభరణాలు లేవని తెలిసిందని, విచారణ జరిపించాలంటూ కడపకు చెందిన కొండోజు ప్రభాకార ఆచారి అనే భక్తుడు దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటపడింది. ఆయన ఫిర్యాదుపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కాకినాడ రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు (ఈయన చందనోత్సవం సమయంలో ఇన్‌చార్జి ఈఓ)ను విజయవాడ అధికారులు ఆదేశించారు. ఆయన అసిస్టెంట్ కమిషనర్ హోదా కలిగిన వల్లంరాజును జ్యువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ (జేవీఓ)గా సింహాచలం పంపించారు. ఆయన అనేకసార్లు ఆలయ అధికారులు, పూజార్లతో ... మిగతా 8వ పేజీలో

రిజిస్టర్‌లో నమోదు చేయని వెండి వస్తువులివీ..

- వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 248 గ్రాముల వెండి పళ్లెం
- గ్రామదేవత పైడితల్లమ్మ ఆలయంలో 329 గ్రాముల అరిటాకు పళ్లెం
- బంగారమ్మ ఆలయంలో 16 గ్రాముల బరువున్న రెండు సూత్రాలు
- భైరవస్వామి ఆలయంలో 208 గ్రాముల అర్ధ కిరీటాలు రెండు, 1.15 కిలోల బరువుగల రాళ్ల కవచం
- మాధవధార వేణుగోపాలస్వామి ఆలయంలో 89 గ్రాముల పంచపాత్ర, ఉద్ధరిణి
- మాధవధార మల్లికార్జునస్వామి సన్నిధిలో 552 గ్రాముల అష్టలక్ష్మీ బిందె, 640 గ్రాముల బకెట్, చెంబు, చెంచా, 790 గ్రాముల ధార పాత్ర, 2,820 గ్రాముల పానుమట్టం, 218 గ్రాముల నాగాభరణం
- సింహగిరిపై కాశీవిశ్వేశ్వర పంచాయతన ఆలయంలో 835 గ్రాముల ధార పాత్ర, 260 గ్రాముల శఠారి, 955 గ్రాముల పళ్లెం
- గంగధార సమీపాన ఉన్న సీతారామస్వామి దేవాలయంలో 78 గ్రాముల కిరీటం, తదితర వస్తువులు...

కుంగిన కల్వర్టు

నర్సీపట్నం- తాళ్లపాలెం మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు

- కొత్త కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులు



కన్నూరిపాలెం సమీపంలో కుంగిన కల్వర్టు

నర్సీపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): **నర్సీపట్నం- తాళ్లపాలెం మార్గంలో కన్నూరిపాలెం సమీపంలో కల్వర్టు కుంగింది. దీని స్థానంలో కొత్త కల్వర్టు నిర్మించడానికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభంకాలేదు. కాగా కుంగిన కల్వర్టు కూలిపోతే రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.**

పయనీర్ కంపెనీకి ముడి సరుకు లారీలు, నల్లరాయి టిప్పర్లు అధిక లోడుతో తిరగడం వలన తాళ్లపాలెం వంతెన దెబ్బతిన్న విషయం తెలిసిందే. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో పోలీసులు, రవాణాశాఖ అధికారులు వాహనం బరువుతో కలిపి 40 టన్నులు మించకూడదని నిబంధన పెట్టారు. అక్కడ చెక్ పోస్టు కూడా ఏర్పాటు చేశారు. అయితే అధిక లోడుతో తిరుగుతున్న లారీలు, టిప్పర్ల కారణంగా వంతెనతో పాటు కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఇదే క్రమంలో కన్నూరిపాలెం సమీపంలో కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరికొన్ని చోట్ల కల్వర్టుల వద్ద రోడ్లు శిథిలమయ్యాయి. గోతులు పడి ప్రమాదకరంగా మారాయి. దెబ్బతిన్న కన్నూరిపాలెం కల్వర్టు స్థానంలో కొత్తది నిర్మించడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ఇటీవల రూ.36 లక్షలు మంజూరు చేశారు. త్వరలో టెండరు ప్రక్రియ చేపడతామని అధికారులు చెబుతున్నారు. అయితే గోతులు పడిన రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో కల్వర్టు నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టడంతో పాటు బీటీ రోడ్డు మరమ్మతులు చేయాలని ... మిగతా 8వ పేజీలో

జలమా.. గరళమా?

ఫార్మా వ్యర్థాలతో కలుషితమైన మల్లోడి గెడ్డ నీరు

- రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా బయటకు విడుదల చేసిన రాంకీ యాజమాన్యం
- తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకున్న పీసీబీ అధికారులు

అనకాపల్లి/పరవాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): **ఫార్మా వ్యర్థాలతో మల్లోడి గెడ్డ కలుషితమైంది. పరవాడ నుంచి భరణికం వెళ్లే రహదారిలో మల్లోడి గెడ్డ నీరు నల్లగా మారిపోయింది. వాగు పొడవునా నీటిపై పెద్ద ఎత్తున నల్లటి తెట్టు తేలింది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు.**

ఫార్మాసిటీ డెవలపర్‌గా వ్యవహరిస్తున్న రాంకీ యాజమాన్యం రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా బయటకు విడిచిపెడుతోందనే విమర్శలు ఉన్నాయి. అవి గెడ్డలు, చెరువుల్లోకి చేరి జలాలు కలుషితమవుతున్నా యని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు రసాయన వ్యర్థ జలాలను డ్రైనేజీల ద్వారా గెడ్డల్లోకి విడిచిపెడుతున్నట్టు తెలిసింది. ఈ ఏడాది మే 18వ తేదీ సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో రాంకీ యాజమాన్యం వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా మల్లోడి గెడ్డ వాగులోకి విడిచిపెట్టడంతో నీరంతా నల్లగా తయారైందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు భరణికం మాజీ సర్పంచ్ బొండా తాతారావు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీసీబీ అధికారులు రాంకీ యాజమాన్యానికి ఈ ఏడాది జూన్ 18న నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇప్పటికీ వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా వాగులోకి విడిచిపెట్టడంతో నీరంతా నల్లగా తయారై తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికే పరవాడ పెద్ద చెరువు పూర్తిగా కలుషితమైంది. ఇందులోని నీటిని పశువులు, ఇతర జీవరాశులు కూడా తాగడం లేదు. ఈ నీరు సాగుకు కూడా పనికి రాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఫార్మా వ్యర్థ జలాలను చెరువులు, కాలువల్లోకి ఇష్టానుసారంగా విడిచిపెడుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. గతంలో కూడా వ్యర్థ జలాలను గెడ్డ వాగులోకి విడిచిపెట్టడంతో 'ఫార్మా యాజమాన్యాల ఇష్టారాజ్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో అప్పట్లో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి వాగులో నీటి నమూనాలను సేకరించి రసాయనాలు ఉన్నట్టు గుర్తించారు. గెడ్డలోని ... మిగతా 8వ పేజీలో





మల్లోడి గెడ్డ నీరు ఫార్మా వ్యర్థాల వలన నల్లగా మారిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) నీటిపై తేలిన ఫార్మా వ్యర్థాలు

బతికి చూపించు!

- ప్రాణాల మీదకు తెస్తున్న క్షణికావేశం
- ఛిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు
- దేశంలో ఏటా లక్షల మంది బలవన్మరణ యత్నం
- గత ఏడాదితో పోలిస్తే రెండు శాతం పెరిగిన ఆత్మహత్యలు

నేడు ఆత్మహత్యల నివారణ దినం

- కథనం 8వ పేజీలో..

మావోయిస్టు లొంగుబాటు

- రూ.6 లక్షల రివార్డు సొమ్మును అతనికే అందజేసిన అల్లూరి జిల్లా ఎస్పీ

- వార్త 8వ పేజీలో..

కుప్పకూలిన పురాతన భవనం

శిథిలాలు రేకుల షెడ్డుపై పడడంతో నేలమట్టం

- వేకువజామున ఈ సంఘటన జరగడంతో తప్పిన పెను ప్రమాదం



నర్సీపట్నం పాత బస్టాండ్ వద్ద కూలిన పురాతన భవనం

నర్సీపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): **నర్సీపట్నం పాత బస్టాండ్ సమీపంలో ఒక పురాతన భవనం మంగళవారం వేకువజాము 3.30 గంటలకు కుప్పకూలిపోయింది. భవనం శిథిలాలు పక్కనే ఉన్న చెప్పుల దుకాణంపై పడడంతో అది నేలమట్టమైంది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.**

పాత బస్టాండ్ వద్ద మెయిన్ రోడ్డును ఆనుకొని కమిడిశెట్టి సూర్యనారాయణకు చెందిన పురాతన భవనం ఉంది. అందులో బియ్యం వ్యాపారం చేస్తూ పక్కనే నివాసం ఉంటున్నారు. ఈ పురాతన భవనాన్ని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో పైల అప్పలనాయుడు అనే వ్యక్తి రేకుల షెడ్డు వేసుకుని చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నారు. కాగా పురాతన భవనం కుప్పకూలి శిథిలాలు రేకుల షెడ్డుపై పడడంతో అది నేలమట్టమైంది. రెండు రోజుల క్రితం ఈ పురాతన భవనం పైఅంతస్థులో ఉన్న గదిని కూల్చివేశారు. ఈ క్రమంలో భవనం బలహీనపడి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రాంతం పగలంతా నిత్యం రద్దీగా ఉంటుంది. తుని, కృష్ణాదేవిపేట వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోలు ఇక్కడే ఆపుతుండడంతో ప్రయాణికులు అక్కడే వేచి ఉంటారు. ఈ ఘటన పగలు జరిగి ఉంటే ఎక్కువగా ప్రాణనష్టం జరిగి ఉండేదని స్థానికులు ... మిగతా 8వ పేజీలో

రియో వచ్చేసింది

- జిల్లా పోలీస్ శాఖలో చేరిన నూతన జాగిలం



రియో జాగిలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌శాఖలో కేసుల ఛేదన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కొత్త జాగిలం 'రియో' చేరిందని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి వచ్చిన జాగిలాన్ని ఆయన పరిశీలించారు. బెల్జియం మలనాయిస్ జాతికి చెందిన ఈ ఆడ జాగిలం మంగళగిరి హెడ్ క్వార్టర్స్ ఆరవ బెటాలియన్‌లో పది నెలల పాటు ట్రాకింగ్, పేలుడు పదార్థాలను గుర్తించడం వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ పొందిందన్నారు. రియో పేరుతో గల జాగిలాన్ని డాగ్‌స్క్వాడ్ సిబ్బందికి అందజేసి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గుంత.. ఆదమరిస్తే అంతే..

▸▸ పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-ఎలమంచిలి ప్రధాన రహదారిలో గొర్లె ధర్మవరం వద్ద రోడ్డుపై పెద్ద గుంత పడింది. వెదురువాడ కల్లుపాకలు, గొర్లెధర్మవరం జంక్షన్ మధ్య రోడ్డు మధ్యలో ఈ గుంత పడింది. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదు. ఈ రోడ్డు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఎలమంచిలి హైవే నుంచి అచ్యుతాపురం మీదుగా విశాఖ వెళ్లే వాహనాలు ఈ రోడ్డు గుండానే వెళ్లాలి. అలాగే అచ్యుతాపురం సెజ్‌కి వచ్చే ప్రతి వాహనం కూడా ఈ మార్గం గుండానే వెళ్లాలి. అటువంటి ముఖ్యమైన రహదారిలో పెద్ద గుంత పడింది. దీనిని గమనించిన గొర్లె ధర్మవరం బాలురు అక్కడ గుంత ఉందని వాహన చోదకులకు తెలియడానికి సోమవారం చెట్టు కొమ్మలను పెట్టారు. వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.


గుంతలో చెట్టు కొమ్మలను పెడుతున్న బాలుడు

అనకాపల్లి ఆవ కాలువకు అడ్డంగా కూలిన వృక్షాలు

మునగపాక, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఆవకాలువలో పలు చోట్ల భారీ చెట్లు కూలడంతో నీటి ప్రవాహం వేగం తగ్గుతోంది. ఇటీవల కాలంలో వర్షాలు అధికంగా కురవడంతో అనకాపల్లి ఆవఖండం నుంచి సాగునీటి కాలువ ద్వారా నీరు దిగువకు వెళుతోంది. ఈ నేపథ్యంలో ఆవకాలువలో మునగపాక ప్రాంతంలో చాలా చోట్ల చెట్లు, తూటిపాదులు అలుకొని ఉండడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందికరంగా మారింది. దీంతో కాలువలో నీటిమట్టం పెరిగి అది ములబందగోడి తదితర ప్రాంతాల్లో నీటి ముంపునకు దారితీస్తోంది. ఆవ కాలువలో పడి ఉన్న చెట్లు, అల్లుకున్న పాదులను తొలగిస్తే ఈపరిస్థితి ఎదురయ్యేదికాదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువలో నీటి ప్రవాహానికి విఘాతంగా ఉన్న చెట్లు, తుప్పలు, పాదులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.


అనకాపల్లి ఆవ కాలువలో అడ్డంగా పడిఉన్న భారీ వృక్షం

సముద్రాలు అంతులేని సంపదకు నిలయాలు

▸▸ ఎన్ఐఓటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ గిడుగు రామదాస్


సదస్సులో మాట్లాడుతున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ డాక్టర్ గిడుగు రామదాస్

పాయకరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సముద్రాలు అంతులేని సంపదకు నిలయాలని, వాటిని కాపాడుకోవాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ డాక్టర్ గిడుగు రామదాస్ అన్నారు. మంగళవారం స్థానిక స్వేసెస్ డిగ్రీ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో సముద్ర సాంకేతిక పరిజ్ఞానంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సముద్రాల నుంచి వచ్చిన అపరిమితమైన వనరులు, వాటిని పొందేందుకు అధ్యయనం చేసేందుకు కృషి జరుగుతోందన్నారు. భారతదేశం సముద్రయాన్ అభియాన్ ద్వారా మత్స్య 6000 అనే జలాంతర్గమిని రూపొందించి మానవులను ఆరు వేల అడుగుల లోతులకు పంపగలిగామని, ఈ విజయంతో భారతదేశం ప్రపంచంలో ఆరో దేశంగా అవతరించిందన్నారు. ఇది దేశానికి గర్వకారణమన్నారు. అనంతరం ప్రస్తుత సముంద్ర సాంకేతిక పరిజ్ఞానం, వనరులు పొందేందుకు, అధ్యయనం చేసేందుకు ఉపయోగించే పరికరాలు, సాంకేతికతను విద్యార్థులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, పలువురు అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురు వైసీపీ నేతలు హౌస్ అరెస్టు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో రైతు పోరు కార్యక్రమంలో పాల్గొనడానికి వెళుతున్న పలువురు వైసీపీ నాయకులను మంగళవారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. పెంటకోటలోని తన స్వగృహం నుంచి బయలుదేరుతున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావును గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ రైతులకు బాసటగా చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ప్రభుత్వం ఆంక్షలు విధించి అడ్డుకోవడం సమంజసం కాదన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లిలో తలపెట్టిన రైతు పోరు కార్యక్రమానికి అనుమతులు లేవంటూ జడ్‌పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు జి.శ్రీను బాబు, వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ ప్రచార అధ్యక్షుడు కొవిరి రామకృష్ణలను వారి నివాసాల్లో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష రాజకీయాను చేస్తుందని విమర్శించారు.

ఎలమంచిలిలో..

రైతు పోరు కార్యక్రమానికి వెళ్లకుండా మంగళవారం వైసీపీ నేత, ఎంపీపీ బోదెపు గోవింద్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా రైతు సమస్యల కోసం నిర్వహించే ఈ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడం తగదన్నారు.


తంగేడులో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు హౌస్ అరెస్టు చేసిన పోలీసులు


నక్కపల్లిలో వీసం రామకృష్ణ తదితర నాయకులను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

ఎస్.రాయవరంలో..

మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నాయకులను మంగళవారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దార్లపూడికి చెందిన వైసీపీ నాయకుడు పోలిశెట్టి పెదఈశ్వరరావు, గోకులపాడుకు చెందిన అద్దేపల్లి నూకినాయుడు, పేటసూదిపురానికి చెందిన అల్లాడ నాగరాజులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

కోటవురట్లలో..

మండలంలో పాములవాక, తంగేడు గ్రామాల్లో వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, రాష్ట్ర వైసీపీ అదనపుకార్యదర్శి సాగినీత బాబు (దత్తుడు), వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడం భావ్యం కాదన్నారు.

నక్కపల్లిలో..

అనకాపల్లిలో నిర్వహించిన రైతు పోరు కార్యక్రమానికి వెళ్లకుండా వైసీపీ నేతలు వీసం రామకృష్ణ, వీసం నానాజీ, మనబాల తాతారావు, కొప్పిశెట్టి హరిబాబు, తళ్లా భార్గవ్, గంటా తిరుపతిరావు, బంగార్రాజు, అల్లాడ కొండలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. వారంతా వీసం నివాసం వద్ద నిరసన తెలిపారు.

పాయకరావుపేటలో..

అనకాపల్లిలో మంగళవారం వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా ఆ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా ఇంటి నుంచి బయలుదేరడానికి సిద్ధమైన సాయి బాబాతో పాటు ఆ పార్టీ నాయకులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

ఇద్దరు నేతలకు నామినేటెడ్ పదవులు


బొందల శ్యామ్


ఇబ్రహీం బాషా

అచ్యుతాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరు నేతలకు నామినేటెడ్ పదవులు దక్కాయి. అచ్యుతాపురానికి చెందిన బొందల శ్యామ్ (జనసేన)కి రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి దక్కగా, ఖాజీపాలెంకి చెందిన జిల్లా మైనారిటీ మోర్చ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం బాషాకి ఏపీ నూర్/దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వీరికి పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

అర్హులైన దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు

పాయకరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందజేస్తామని ఎంఈఓ కె.రమేష్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, ఆల్మికో సంస్థ సంయుక్తంగా దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందించేందుకు ఏర్పాటుచేసిన గుర్తింపు నిర్ధారణ శిబిరంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్ష ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.రామకృష్ణనాయుడు మాట్లాడుతూ శిబిరానికి నాలుగు మండలాల నుంచి 200 మంది దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్మికో సంస్థ వైద్య బృందం, హెచ్ఎం కె.నానాజీ పాల్గొన్నారు.

తెలుగు యువత మండల అధ్యక్షుడిగా లోవరాజు


లోవరాజును సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవు పోలవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత కోడ లోవరాజు తెలుగు యువత మండల అధ్యక్షునిగా నియమితులయ్యారు. మంగళవారం నక్కపల్లిలో గల హోం మంత్రి అనిత క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో లోవరాజును టీడీపీ మండల అధ్యక్షుడు అలకంటి అబద్ధం, కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ, టీడీపీ నేతలు యేజెర్ల వినోద్‌రాజు, ఎన్. వెంకటరాజు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిలో నియమించిన హోం మంత్రి అనితకు కృతజ్ఞతలు తెలిపారు.

పుష్కలంగా యూరియా

▸▸ 'పేట' సొసైటీ చైర్‌పర్సన్ రాజబాబు


సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ రాజబాబు

పాయకరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటకు అవసరమైన యూరియా పుష్కలంగా ఉందని పాయకరావుపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్ దేవవరపు రాజబాబు తెలిపారు. మంగళవారం సొసైటీ ఆవరణలో సభ్యరైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ పరిధిలో వరి పంట సాగుచేస్తున్న రైతులకు ఇప్పటికే 12 టన్నుల యూరియా అందజేశామన్నారు. ఒకటి రెండ్రోజుల్లో 12 టన్నుల యూరియా రానుందన్నారు. ప్రతి సభ్య రైతుకి అవసరమైన యూరియా అందజేస్తామన్నారు. సొసైటీ డైరెక్టరు కూలి నానాజీ, కట్టా శ్రీను, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ నేతలు పెదిరెడ్డి చిట్టిబాబు, చించెలపు ప్రదీప్, యాళ్ల వరహాలబాబు, సొసైటీ సీఈఓ పి.నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.

తోటాడ రైతు సేవా కేంద్రానికి త్వరలో 12 టన్నుల యూరియా

▸▸ అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్

మునగపాక, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోటాడ రైతు సేవా కేంద్రానికి 12 టన్నుల యూరియా త్వరలో రానుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం తోటాడ రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించి ఎరువులు వాడడం వలన ప్రయోజనం ఉండదన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.జ్యోత్స్నకుమారి, డీటీ మురళి, ఏఈవో, వీఆర్వో, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


తోటాడ రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న శ్రీధర్

రైతులు నానో ఎరువులను వినియోగించాలి : ఏడీఏ


ఏటికొప్పాకలో రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ జాహ్నవి

ఎలమంచిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ డివిజన్‌లోని రైతాంగం నానో ఎరువులను వినియోగించుకుని సత్ఫలితాలు సాధించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జాహ్నవి రైతులకు సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎలమంచిలి, ఏటికొప్పాక, బయ్యవరం గ్రామాల్లో రైతుల పంట పొలాలను పరిశీలించి, పలు సూచనలు అందించారు. రైతాంగానికి యూరియా కొరత లేదని, రెండు రోజుల్లో 50 మెట్రిక్ టన్నుల యూరియా వస్తున్నదన్నారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ఆందోళన

ఎలమంచిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పట్టణంలో ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రోడ్డుపై మధ్యాహ్నం వంటా-వార్పు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆటో మోటారు యూనియన్(సీఐటీయూ)జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం రూ.30 వేలు భరోసా అందజేయాలని, ఆటో విడిభాగాలపై ట్యాక్స్ తగ్గించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రతినిధులు అల్లిమల్ల నాగు, కొటారు తాతాజీరావు, బంగారు అప్పలనాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

మునగపాకలో..

ఏపీలో అమల్లోకి వచ్చిన స్త్రీశక్తి పథకం కారణంగా వృత్తిపరమైన ఇబ్బందులకు గురవుతున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం భరోసా చూపాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మునగపాకలో మంగళవారం స్థానిక ఆటో యూనియన్ నిరసన కార్యక్రమం చేపట్టింది. వారికి సంఘీభావాన్ని ప్రసాద్ ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీల్లో ఉచిత బస్సు ప్రయాణం కారణంగా మహిళలకు లబ్ధి కలుగుతున్నప్పటికి అదే కారణంగా ప్రయాణికులు లేక ఆటో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిరసనలో భాగంగా కార్మికులంతా ఆటోలను నిలుపుదల చేశారు.


ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

రైతులపై వైసీపీ నేతలది మొసలి కన్నీరు

టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి ఆదిబాబు

అచ్యుతాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులపై వైసీపీ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి కర్రి ఆదిబాబు అన్నారు. మంగళవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ వైసీపీ నాయకులు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో అన్ని మండలాల్లో ముందుగానే ఎరువులు సిద్ధం చేశారన్నారు. రైతులంతా ఆనందంగా ఉన్నారని, వైసీపీ నాయకులు మాత్రం అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పాడి రైతులకు కూడా ఎరువులు ఇచ్చి ప్రోత్సహించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. వైసీపీ నాయకులు చేపట్టిన ఆందోళనల్లో ఒక్క రైతు కూడా ఉండకపోవడం విశేషమన్నారు.

సేవా పక్షోత్సవాల నిర్వహణకు సిద్ధంగా ఉండండి

భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

మునగపాక, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ పక్షోత్సవాలు నిర్వహణకు పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలో నాగులాపల్లిలో బీజేపీ మండల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ జిల్లా పర్యటన, 14వ తేదీన విశాఖలో నడ్డా బహిరంగసభ జరగనున్నాయని తెలిపారు. అనంతరం 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు పక్షోత్సవాలు నిర్వహించి పార్టీ బలోపేతం కోసం శ్రమించాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మళ్ల కాళ్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొడ్డేడ భాస్కరరావు, యల్లపు రాజేశ్వరరావు, దొడ్డి సత్యనారాయణ, మల్లయ్య, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను పరిశీలించిన ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూడిమడకలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోమవారం రాత్రి పరిశీలించారు. నిల్వ నూనెలు వాడకం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రజారోగ్యం ముఖ్యమని, ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

పెదపల్లి రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం

ఎలమంచిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదపల్లి రోడ్డుపై మంగళవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. మంగళవారం ఎలమంచిలి నుంచి పెదపల్లి రోడ్డు మీదుగా పెద్ద లారీ రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో దారిపొడవునా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇదే సమయంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు వాహనాల్లో అసౌకర్యానికి గురయ్యారు. పట్టణంలో పెద్ద వాహనాలు పగటి పూట రాకుండా రాత్రి పది గంటల తర్వాత వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రామ్‌నగర్ కాలనీలో వికసించిన బ్రహ్మకమలం

ఎలమంచిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో విశ్రాంత ఉద్యోగి సీహెచ్. సోమేశ్వరరావు ఇంటిలో సోమవారం రాత్రి బ్రహ్మకమలం వికసించింది. ఈ విషయం తెలియడంతో చుట్టుపక్కల వారంతా ఈ పుష్పాన్ని తిలకించారు.


సోమేశ్వరరావు ఇంట్లో వికసించిన బ్రహ్మకమలం

ఖరీఫ్‌లో పూర్తిగా సాగు నీరందిస్తాం : డీఈఈ

పాయకరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో భూమి, ముఠా ఆనకట్టల ఆయకట్టు, అన్ని సాగునీటి చెరువుల ఆయకట్టులకు ఖరీఫ్‌లో వరి పంటకు పూర్తిస్థాయిలో సాగు నీరందిస్తామని జలవనరుల శాఖ పాయకరావుపేట డీఈఈ సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో మండలంలోని ఏడు సాగునీటి సంఘాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు పడే అవకాశం ఉందని, ఆనకట్టల వద్దకు ఎగువప్రాంతం నుంచి అధికంగా నీరు వస్తున్నందున ఆయకట్టు శివారు భూముల వరకు సాగునీరందిస్తామన్నారు. సాగునీటి చెరువుల్లో అధికంగా నీరు నిల్వ ఉన్నందున ఈ ఏడాది సాగునీటి సమస్య ఉండే అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, సాగునీటి సంఘాల చైర్‌పర్సన్లు పాల్గొన్నారు.

ఉత్తమ పీఈటీ రవికుమార్‌కు సన్మానం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడు తెనాలి రవికుమార్‌ను మంగళవారం గుంటపల్లి జడ్పీ పాఠశాలలో ఏపీటీఎఫ్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా తెనాలి రవికుమార్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు వేణు, ప్రసన్నకుమార్, ధర్మారావు, శ్రీను, గణేశ్, వెంకటరావు, హెచ్ఎం రామారావు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు అభినందన

ఎస్.రాయవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ 2025లో ఎంపికైన ఉపాధ్యాయుల అభినందన సభను మంగళవారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను సర్పంచ్ కర్రి సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుర్రం రామకృష్ణ, టీడీపీ నాయకుడు వంగలపూడి గోవింద్, ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి వెంకటపతిరాజు, విశ్రాంతి ఉపాధ్యాయులు బొడ్డు బాబూరావు, సింహాచలం, అప్పలరాజు, ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ గోవిందరావు, అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హరిపాలెం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీని ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్, పీహెచ్‌సీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రంజిత్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ వంటి పలు విభాగాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలలో భాగంగా నిర్దేశిత లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ నెల 9 న జరిగే గర్భిణుల తనిఖీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.శ్రీనివాస్, ఆరోగ్య శిక్షకురాలు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, మహేష్, సిబ్బంది ఇందిరా, శోభ, శిరీష పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా పంచాయతీ స్థలాలపై విజిలెన్స్ విచారణ

పాయకరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లేఅవుట్లలో పంచాయతీ స్థలాలు గుర్తించి స్వాధీనం చేసుకోవడం కోసం విజిలెన్స్ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాలబాబు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ స్థలాల ఆక్రమణ, పంచాయతీలో అవకతవకలపై రాష్ట్ర హోం మంత్రి అనిత విజిలెన్స్ విచారణకు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని స్థానిక వైసీపీ నాయకుడు తెలపడం అభినందనీయమన్నారు. పంచాయతీతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వేసిన లేఅవుట్లపైనా విజిలెన్స్ విచారణకు హోం మంత్రి ఆదేశాలు జారీచేశారన్నారు. ఈ విచారణ పార్టీలకు అతీతంగా నిష్పక్షపాతంగా జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చించెలపు ప్రదీప్, నాయకులు గొల్లపల్లి నాగు, రాజాన ఆది పాల్గొన్నారు.

తిమ్మాపురం హెట్రో కాలనీలో నూతన విద్యుత్ లైను ఏర్పాటు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం హెట్రో కాలనీలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్ కర్రి సత్యనారాయణ రూ. 1.5 లక్షలు పంచాయతీ నిధులతో కాలనీలో నాలుగు స్తంభాలతో విద్యుత్ లైను వేయించి, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. పదేళ్లుగా విద్యుత్ దీపాలు లేక కాలనీ వాసులు రాత్రి సమయంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విద్యుత్ సౌకర్యాన్ని కల్పించిన సర్పంచ్ సత్యనారాయణకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

అచ్యుతాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌ఓ భవాని అన్నారు. మంగళవారం రామన్నపాలెంలో ఆయుష్మాన్ ఆరోగ్య సిబ్బంది మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సుని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మహిళలకు వచ్చే రొమ్ము, నోటి, గర్భాశ క్యాన్సర్ల గురించి వివరించారు. అలాగే మహిళలు తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, సరోజిని, రమణమ్మ, పద్మావతితో పాటు వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సురక్షిత తాగునీరు : ఎంపీడీవో

నక్కపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు చెప్పారు. మంగళవారం మండలంలోని సీహెచ్ఎల్ పురం, జానకయ్యపేట గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్, డోర్ టూ డోర్ చెత్తసేకరణ పనులను వారు పరిశీలించారు. ప్రజలకు కూడా పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నామని వారు చెప్పారు.

వినియోగంలోకి సొసైటీ గోదాం తీసుకు వస్తా

నాగులాపల్లి సహకార సంఘ చైర్‌పర్సన్ భాస్కరరావు

మునగపాక, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటాడలో నిర్మించిన బహుళ ప్రయోజనకర గోదాము సేవలు త్వరలో వినియోగంలోకి తీసుకు వస్తామని నాగులాపల్లి సొసైటీ చైర్‌పర్సన్ యల్లపు వెంకటభాస్కరరావు తెలిపారు. మండలంలో తోటాడలో రూ.35లక్షలతో నిర్మించిన గోదాంను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులు గుర్తించామని, సర్వసభ్య సమావేశంలో చర్చించి తీర్మానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో మళ్ల స్వామి, డైరెక్టర్లు కొంతం జగదీశ్వరరావు, సుందరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దారిద్ర్యం.. రాకపోకలు నరకం!

ఏదైనా రోడ్డు ఎక్కడో చోట.. లేదా అక్కడక్కడా మరమ్మతులకు గురవుతుంది. కానీ, మార్టూరు-మాకవరం రహ'దారి' పొడవునా గోతులమయమైంది. భారీ వాహనాల రాకపోకలతో మరింత ఛిద్రమైంది. చినుకు పడితే నీరు చేరి చెరువులను తలపిస్తోంది. దాదాపు కిలోమీటరు మేర తారు లేచిపోయి రూపు కోల్పోయింది. ఫలితంగా వాహన చోదకులు, ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం చూపిస్తోంది.

మార్టూరు-మాకవరం రోడ్డు అధ్వానం

- భారీ వాహనాల ప్రయాణంతో ఛిద్రం
- రహదారి ఆద్యంతం గోతుల మయం
- చినుకు పడితే చెరువులను తలపిస్తున్న వైనం
- ప్రయాణికులు, వాహన చోదకుల అగచాట్లు


ఛిద్రమైన మార్టూరు-మాకవరం రోడ్డు

తుమ్మపాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని మార్టూరు-మాకవరం రహదారికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ రోడ్డులో నిత్యం పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా మార్టూరు, మాకవరం, అగ్రహారం, పాపయ్యపాలెం, సంతపాలెం, కొండుపాలెం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు అనకాపల్లి పట్టణానికి వస్తూపోతుంటారు. అలాగే అటు వైపుగా చోడవరం వైపు వెళ్లే వారు కూడా ఈ రోడ్డులోనే ప్రయాణాన్ని సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డు అధ్వానంగా తయారైంది. దారి పొడవునా భారీ గోతులు ఏర్పడడంతో పాటు కిలోమీటరు మేర తారు లేయరు లేచిపోయింది. అనకాపల్లి-చోడవరం రోడ్డును


రూపు కోల్పోయిన రహదారి


గోతులతో దర్శనమిస్తున్న మార్గం

అనుకొని ఉన్న ఈ రహదారి దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ఆనవాళ్లు కోల్పోయింది. ఈ రోడ్డు పూర్తిగా రూపు కోల్పోయి భయానకంగా తయారవ్వడంతో వాహన చోదకులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడడంతో కురుస్తున్న వర్షాలకు ఆ గోతుల్లో రోజుల తరబడి నీటి నిల్వలు ఉండిపోతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిలోమీటరు మేర తారు లేయరు లేచిపోయి రోడ్డు పూర్తిగా రూపు కోల్పోవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు సందర్భాల్లో అదుపు తప్పి గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు.

ఇక రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణించే వారు అర చేతుల్లో ప్రాణాలు పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి దాపురించింది. ఈ రోడ్డులో విద్యుత్ దీపాలు లేకపోవడంతో చిమ్మచీకటిలో రోడ్డుకు, గోతులకు తేడా తెలియక పలువురు వాహనదారులు అదుపుతప్పి గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. మార్టూరు గ్రామ సమీపంలో అధిక సంఖ్యలో క్వారీ, క్రషర్లు ఉన్నాయి. క్వారీ, క్రషర్ల నుంచి భారీ వాహనాలు నిత్యం అధిక లోడులతో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఈ రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. అడ్డు అదుపు లేకుండా ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని పలుమార్లు ఆయా గ్రామస్థులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన ఈ రోడ్డు నిర్మాణం చేపట్టి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేదు



మార్టూరు-మాకవరం రహదారి విషయంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం లేకపోతోంది. ఈ రోడ్డులో భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించే వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట వేయాలి. రోడ్డు పునర్నిర్మించాలి.

-కోడి నాగేశ్వరరావు, మార్టూరు

రాత్రి వేళల్లో భయం.. భయంగా రాకపోకలు



మార్టూరు-మాకవరం రోడ్డులో రాత్రి పూట భయం.. భయంగా రాకపోకలు సాగిస్తున్నాం. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో ఈ రోడ్డులో రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నాం. అతి వేగంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, మరో వైపు ఈ రోడ్డులో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణించి క్షేమంగా ఇంటికి చేరుకుంటామా? అనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

- వడ్డాది త్రిమూర్తులు, మార్టూరు

మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పరవాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని శివారు గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు స్పష్టం చేశారు. జీవీఎంసీ 79వ వార్డులోని దేశపాత్రునిపాలెం, లంకెలపాలెం, సాయినగర్ కాలనీల్లో జీవీఎంసీ నిధులు రూ.3.36 కోట్లతో చేపట్టనున్న సీసీ రహదారులు, కాలువల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని వార్డుల్లో ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తకుండా అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. శివారు గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రిరావు, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాయల్ బాబు, డీఈ అప్పారావు, వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, కూటమి నాయకులు పిళ్లా శివకృష్ణ, మచ్చ శివకుమార్, నగిరెడ్డి బాబూరావు, లక్కరాజు శ్రీను, అమరపిన్ని గోపి తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

- టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కర్రి బాబి

తుమ్మపాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత ఉందంటూ వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు తక్షణమే మానుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబీ హితవు పలికారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా యూరియా కొరత లేదన్నారు. రైతులకు కావాల్సినంత యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదన్నారు. ఉనికి కోల్పోతున్న వైసీపీ నాయకులు పబ్బం గడుపుకునేందుకే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అనవసరమైన వదంతులతో సోషల్ మీడియాలో కొంతమంది అసత్య ప్రచారాలు చేయడం దారుణమన్నారు. అసత్య ప్రచారాలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డి.గంగరాజు, ముచ్చల రాము, మెయ్య నూకరాజు పాల్గొన్నారు.

యూరియా సరఫరాపై యాగీ తగదు

- టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీధర్

కశింకోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేకుండా కొరత ఉందని వైసీపీ నేతల యాగీ చేయడం తగదని టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు అవసరమైన యూరియాను ఢిల్లీ నుంచి ఒకే రోజులో 50 వేల టన్నులు కాకినాడ పోర్టుకు తీసుకువచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మరోసారి ఆయన రైతు పక్షపాతి అని నిరూపించుకున్నారని చెప్పారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానుకొని రైతుల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన హితవు పలికారు.

బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల బీమా

పరవాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలమ్మపాలెం, గొన్నవానిపాలెం గ్రామాలకు చెందిన జనసేన కార్యకర్తలు అర్జిల్లి బంగారి, మట్టా అప్పారావు ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలకు జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ ప్రకటించారు. మంజూరు పత్రాలను మంగళవారం జనసేన మండల అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసకానులు, సర్పంచ్ చింతకాయల సుజాత చేతుల బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిహెచ్.ముత్యాలు, పి.మణికంఠ, బి.రామగోవిందరావు, వి.నరసింహరావు, కె.నరసింగరావు, ఎస్.ముత్యాలరావు, సిహెచ్.అమ్మోరు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

సబ్బవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న డాక్టర్ టి.రాంబాబును మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 189 గురుకులాల్లో ఐదుగురు ఉపాధ్యాయులు ఎంపిక కాగా, అనకాపల్లి జిల్లా నుంచి డాక్టర్ టి.రాంబాబు ఎంపికయ్యారన్నారు. రాంబాబు చేసిన ఇన్నోవేషన్ ప్రాజెక్టులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన్ననలు అందుకున్నారని ఆయన పేర్కొన్నారు.

మామిడిపాలెంలో క్వారీ నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఆర్డీవో షేక్ ఆయిషా... హాజరైన గ్రామస్థులు

తుమ్మపాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మామిడిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 109లో 10.18 హెక్టార్లల్లో రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్ తవ్వకాల కోసం మంగళవారం ఆర్డీవో షేక్ ఆయిషా అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. గ్రామ సర్పంచ్ పూడి పరదేశినాయుడు మాట్లాడుతూ గ్రామానికి మేలు చేస్తూ తమ వ్యాపారాలు నిర్వహించుకుంటే ఎలాంటి అభ్యంతరాలు లేవన్నారు. కచ్చితంగా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. అలాగే గ్రామంలో యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. గ్రామ నాయకుడు చెక్కల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు సైతం నిరంతర పర్యవేక్షణ చేయాలని కోరారు. గ్రామ అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని క్వారీ యాజమాన్యం సహకరించాలని కోరారు. అనంతరం ఆర్డీవో షేక్ ఆయిషా మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థులు వెల్లడించిన అభిప్రాయాలను రికార్డు చేయడం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ వివరాలను తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంకా ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వినతిపత్రాల ద్వారా అందించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల గోవింద్


కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల గోవింద్ డిమాండ్ చేశారు. ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారంఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు ఇచ్చి డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన ఓలా, ఓబర్, రాపిడో వాహనాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లో ఓలా, ఓబర్, రాపిడో సౌకర్యాలను నిషేఈటంచి ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగేశ్వరరావు, కె.జగదీశ్, నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పట్టణంలో ఆటో కార్మికుల ర్యాలీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీవీ శ్రీనివాసరావు, రుత్తల శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో కార్మికులకు ఉపాధి దెబ్బతిందన్నారు. నిరుద్యోగులుగా ఉన్న యువకులు రుణాలు తీసుకొని ఆటోలు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారి చెప్పారు. ఉచిత బస్ పథకంతో తాము ఉపాధి కోల్పోతున్నామని, ప్రభుత్వం తక్షణమే ఆటో కార్మికులను ఆదుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సత్యనారాయణ, జి.దేముడునాయుడు, సూరిశెట్టి బాపునాయుడు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు మెరుగైన సేవలు

- అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

సబ్బవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.మోహనరావు సూచించారు. సబ్బవరం పశు వైద్యశాలలో మంగళవారం వైద్య సిబ్బందితో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రూ.150కే అందుబాటులో ఉన్న లింగ నిర్ధారణ వీర్యంపై రైతులు అవగాహన కల్పించాలని సూచించారు. కిషాన్ క్రెడిట్ లోన్స్ కోసం ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి కనీసం ఐదు దరఖాస్తులు సేకరించాలని తెలిపారు. ఈ నెల 15 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. మండలానికి అవరమైన 16,250 డోసులు సిద్ధం చేశామన్నారు.కోళ్ల వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ డాక్టర్ వి.చిట్టినాయుడు, వైద్యులు స్వర్ణలత, అరుణ, సంధ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు 5కే రన్


5కె రన్ ప్రారంభించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం జిల్లా స్థాయి మారథాన్ 5కే రెడ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ వినోద్ ప్రారంభించారు. పోటీల్లో మొదటి బహుమతి రామానాయుడుకు రూ.10 వేలు, రెండో బహుమతి వినోద్‌కు రూ.7 వేలు, మహిళల విభాగంలో వాణికి ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, దివ్య దుర్గాకు రెండో బహుమతిగా రూ.7 వేలు, ట్రాన్స్‌జెండర్ విభాగంలో రేవతి, కావ్యలకు నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది ప్రసాదరాజు, రవి, ఆదినాయుడు, కె.రామచందర్, ప్రశాంతి, చిరంజీవి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో రెడ్డి దీక్షిత ప్రతిభ



విద్యార్థిని రెడ్డి దీక్షితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ స్వామినాయుడు తదితరులు

సబ్బవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్కిడ్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో 8వ తరగతి చదువుతున్న రెడ్డి దీక్షిత రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ వి.స్వామినాయుడు మాట్లాడుతూ.. ఈ నెల 7న విశాఖలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన వ్యక్తిగత 'కటా అండ్ కుమిటే' ఈవెంట్‌లో 2వ స్థానాన్ని, 40-45 కిలోల కేటగిరీ కరాటేలో 3వ స్థానాన్ని దీక్షిత సాధించిందన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో దీక్షితను ప్రిన్సిపాల్ స్వామినాయుడు, కోచ్ అప్పారావు అభినందించారు.

స్పోర్ట్స్‌చాంపియన్‌షిప్‌లో అనకాపల్లికి ప్రథమ స్థానం

కొత్తూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమలలో ఈ నెల 5న జరిగిన 50వ రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో అనకాపల్లికి చెందిన కోట్ని మౌళికదేవి ప్రథమ స్థానంలో నిలిచినట్టు కోచ్ బొద్దపు అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలో 14 టీములు పాల్గొనగా అనకాపల్లికి చెందిన టీమ్ పది మందిలో మౌళికదేవి అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ మేరకు స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అవినాష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, గోల్డ్ మెడల్, బహుమతిని అందుకున్నారు.

కరాటే పోటీల్లో అనకాపల్లి క్రీడాకారుల ప్రతిభ


కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఆదివారం జరిగిన మూడో రాష్ట్ర ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో దక్షిత కరాటే అసోసియేషన్ క్రీడాకారులు చక్కని ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వివిధ విభాగాల్లో చిన్నారులు పాల్గొని బ్రాంజ్ మెడల్స్ నుంచి గోల్డ్ మెడల్స్ వరకు దక్కించుకున్నారు. ఈ పోటీల్లో అనకాపల్లి చిన్నారులు విజయకేతనం ఎగురవేయడం పట్ల కోచ్ టి.ఈశ్వరరావు చిన్నారులందరినీ అభినందించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అనకాపల్లి రాక రేపు

కొత్తూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన పీవీఎస్ మాధవ్ గురువారం తొలిసారిగా అనకాపల్లి రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి ర్యాలీతో స్వాగతం పలుకుతామన్నారు. స్థానికంగా జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ హాజరవుతారని చయన తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు జీవశాస్త్ర స్టడీ మెటీరియల్

తుమ్మపాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఉపయోగకరమైన జీవశాస్త్ర స్టడీ మెటీరియల్‌ను డీఈవో గిడ్డి అప్పారావునాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెటీరియల్‌ను అనకాపల్లి జిల్లా జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సిద్ధం చేయడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు శతశాతం జీవశాస్త్రంలో మార్కులు సాధించేందుకు ఈ స్టడీ మెటీరియల్ దోహదపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం గౌరవాధ్యక్షుడు కప్పల ప్రసాద్, అధ్యక్షుడు గిరిప్రసాద్, కార్యదర్శి గోవిందరావు పాల్గొన్నారు.

పట్టణంలో జడ్సీ పర్యటన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ముఖ్యంగా కాలువల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఇందులో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ఇరువైపులా డ్రైన్లను పరిశీలించారు. పలుచోట్ల కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో సిబ్బందితో తొలగింపజేశారు. అలాగే ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. స్టేడియం రోడ్డులో పర్యటించి రోడ్లపై అనధికారికంగా ఏర్పాటు చేసిన టెంట్లను తొలగింపజేశారు.

క్రీడల్లో రాణిస్తే గుర్తింపు...

లంకెలపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు వస్తోందని అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి పేర్కొన్నారు. జీవీఎంసీ 84వ వార్డు పరిధిలోని సాలాపువానిపాలెంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలను మంగళవారం సందర్శించారు. క్రీడాకారులతో మాట్లాడి, కాసేపు పోటీలను తిలకించారు. పలు జిల్లాల జట్లు మధ్య పోటీలు రసవత్తరంగా జరిగాయి. కార్యక్రమంలో నిర్వాహకులు మాదంశెట్టి నీలబాబు, సాలాపు మోహన్‌రావు, సాలాపు వెంకటఅప్పారావు, సుమన్‌అప్పారావు, సాలాపు శివ, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి ఉరుకూటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సెలవుపై టీపీవో

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లోని పట్టణ ప్రణాళికా విభాగంలో టీపీవోగా పనిచేస్తున్న కనకారావు దీర్ఘకాలికంగా సెలవుపై వెళ్లారు. మంగళవారం నుంచి మూడు నెలలు పాటు సెలవుపై వెళ్లినట్టు సిబ్బంది తెలిపారు. ఈ విషయమై జోనల్ కమిషనర్ చక్రవర్తిని వివరణ కోరగా సెలవుపై వెళ్లడం వాస్తవమేనన్నారు. ఎవరినైనా ఇన్‌చార్జిగా నియమిస్తారా అని వివరణ కోరగా, ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

క్రీడాకారులకు షూస్ వితరణ

లంకెలపాలెం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అథెటిక్స్ క్రీడల్లో రాణిస్తున్న పేద విద్యార్థులకు సహాయం స్వచ్ఛంద సేవా సంస్థ షూస్‌ను సమకూర్చింది. వీటిని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మంగళవారం అందజేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గుర్రం శంకరరావు, దాసరి రామారావు, ఉపాధ్యాయులు రమణ, మోటూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలేనికి చెందిన తట్టా మనోజ్‌కుమార్ అనే వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై భార్య మహాలక్ష్మి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. చికెన్ షాపు నిర్వహించే మనోజ్‌కుమార్ ఆగస్టు 18వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, తన భర్త ఆచూకీ తెలుసుకొని అప్పగించాలని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు విశ్రాంతి భవనం ఏర్పాటుచేయరూ..

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో రిటైర్డ్ కార్మికులకు విశ్రాంతి భవనం మంజూరు చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు విత్తనాల పోతురాజు, ఎస్‌వీవీ సత్యనారాయణ కోరారు. చాలా కాలంగా భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఒక విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ఉద్యమ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సబ్బవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెలుగు ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే ప్రతీ మహిళా సమాఖ్య సభ్యురాలుకు ఉద్యమ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని పరిశ్రమల ప్రోత్సాహక అధికారిణి ఎస్.త్రివేణి స్పష్టం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం 50 మంది సమాఖ్య సభ్యులతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఉద్యమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఉపయోగాలు గురించి వివరించారు. ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ఇబ్రహీం బాషాకు సత్కారం

కొత్తూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం బాషా రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియామకం పట్ల పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మంగళవారం సత్కరించారు. అనంతరం బాషా మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ సీఎం రమేశ్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.నాగేశ్వరరావు, ఒ.నాగమణి, రమేశ్, సంతోశ్ అయ్యప్పశెట్టి, అచ్చంనాయుడు పాల్గొన్నారు.

బెర్రీ బోరర్ ఆశించిన కాఫీ మొక్కలకు జీవశిలీంధ్రం పిచికారీ

చింతపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో కాఫీ బెర్రీ బోరర్ తెగులు ఆశించిన కాఫీ మొక్కలకు జీవశిలీంధ్రం పిచికారీ చేస్తున్నట్టు అధిపతి, శాస్త్రవేత్త చెట్టి బిందు తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పరిశోధన స్థానంలో తెగులు ఆశించిన కాఫీ తోటల్లో గింజలను పూర్తి స్థాయిలో సేకరించి నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. భవిష్యత్తు ఈతెగులు వ్యాప్తి చెందకుండగా ఉండేందుకు బెవేరియా బెస్సియాన జీవశిలింధ్రం మొక్కలపై పిచికారీ చేస్తున్నామన్నారు. ఈజీవశిలింధ్రం అభివృద్ధి చెంది తెగులు ఆశించే ఆడ కీటకాలను నాశనం చేస్తుందన్నారు.

చింతపల్లి: గిరిజన రైతులు కాఫీ బెర్రీ బోరర్‌పై చైతన్యవంతులు కావాలని స్థానిక డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. మంగళవారం గొందిపాకలు పంచాయతీ పరిధి కాఫీ రైతులకు మండల స్థాయి అధికారులు కాఫీ బెర్రీ బోరర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాఫీ పండ్లు, కాయలులో నల్లని రంధ్రాలు ఉంటే ఈ తెగులు ఆశించినట్టు గుర్తించాలన్నారు. తహసీల్దార్ జి. ఆనందరావు, వ్యవసాయ అధికారి టి. మధుసుదనరావు, ఏపీవో రాజు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, సర్పంచ్ సాగిన వరలక్ష్మి పాల్గొన్నారు.

కాఫీ రైతులు ఆందోళన చెందవద్దు

అనంతగిరి: మండల కేంద్రంలో కాఫీ రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాఫీ తోటల్లోని బ్రెరీ బోరర్ తెగులుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ వీరభద్రచారి, ఎంపీడీవో ప్రభాకర్, ఏవో రంగారావు ఈ సందర్భంగా రైతులకు సూచించారు. మండలంలో 7 వేల మంది కాఫీ రైతులకు 14 ఎకరాలు కాఫీ తోటలు ఉన్నాయని, ప్రస్తుతం తెగులు మండలంలో లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రూతు, కాఫీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బంగారుమెట్టలో కాఫీ తోటలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కుమార్

తెగులు నివారణపై సమష్టిగా కృషి: డీఎల్‌పీవో

ముంచంగిపుట్టు: కాఫీ పంటకు వచ్చే బెర్రీ బోరర్ తెగులు నివారించడానికి గిరిజన కాఫీ రైతులు, అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి (డీఎల్‌పీవో), మండల ప్రత్యేక అధికారి పీఎస్ కుమార్ అన్నారు. మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ కేంద్రంలో కాఫీ తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, తహశీల్దార్ శంకరరావు, ఏవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చింతపల్లిలో కాఫీ రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు కాఫీ బెర్రీ బోరర్‌పై అప్రమత్తం కావాలని మండల ప్రత్యేక అధికారి, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరం బాబు అన్నారు. మంగళవారం మండలంలోని దామనాపల్లి, దేవరాపల్లి గ్రామాల్లో కాఫీ బెర్రీ బోరర్‌పై రైతులకు ప్రత్యేక అధికారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఇమ్మానుయేలు, ఉద్యానశాఖ అధికారి కె. అరుణ కుమారి పాల్గొన్నారు.

మరో 56,503 ఇళ్ల మంజూరుకు ప్రతిపాదన

» గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి. బాబు


మాట్లాడుతున్న బాబు

కొయ్యూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్‌లో ఇటీవల సర్వేలో 56,503 మంది గిరిజనులను గృహ నిర్మాణ అర్హులుగా గుర్తించి అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు జిల్లా గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి. బాబు వెల్లడించారు. మంగళవారం మండల ప్రత్యేకాధికారి హోదాలో పీ-4 సర్వేపై వివిధ శాఖల సిబ్బందితో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాలమురళి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాడేరు డివిజన్‌లో ప్రతిపాదనలు పంపిన వారికి త్వరలో జన్‌మన్ పథకంలో త్వరలో గృహ నిర్మాణాలకు వీలుగా అనుమతులు మంజూరయ్యే వీలుందని అన్నారు. ఇప్పటి వరకు డివిజన్‌లో జన్‌మన్ పథకంలో 28, 661, ప్రధానమంత్రి అవాస యోజన పథకంలో 12,997 ఇళ్లు మంజూరు చేయగా, వీటిలో జన్‌మన్ పథకంలో 80 శాతం మేర నిర్మాణాలు చేపట్టారన్నారు. 2,228 ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. అవాస యోజన పథకంలో 94 శాతం లబ్ధిదారులు నిర్మా ణాలు చేపట్టగా 2,661 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. జన్మన్ పథకంలో లబ్ధిదారులకు రూ 317. 52 కోట్లు మేర, ప్రధానమంత్రి అవాస యోజన పథకంలో రూ. 81.15 కోట్లు చెల్లింపులు జరిపామన్నారు. ఇంకా రూ 4.50 లక్షలు మేర చెల్లింపులు పెండింగ్ ఉన్నాయన్నారు. గతంలో ఎన్టీఆర్ గృహకల్ప పథకంలో మంజూరైన 3331 మంది లబ్ధిదారులకు రూ 9.71 కోట్లు మేర చెల్లింపులు పెండింగ్ ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. 2021-22 కు సంబంధించి పీటీజీలకు గానూ 37, 016 గృహ నిర్మాణాలకు గానూ ప్రతిపాదనలు ఇవ్వగా 30, 333 ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. మిగిలిన 6,773 లబ్ధిదారులకు అడ్వాన్సు రూ. 5 వేలుపడని వారందరి ఇళ్లు రద్దు చేసినట్టు చెప్పారు. అడ్వాన్సు తీసుకుని నేటికి నిర్మాణాలు చేపట్టని 1053 మందికి నోటీసులు ఇచ్చి రికవరీ చేయటంతో పాటు భవిష్యత్తులో వారికి ఏ పథకంలో ఇళ్లు మంజూరు అయ్యే అవకాశం ఉండదన్నారు.పీడి వెంట ఏఈఈ గోవిందు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తం: డీఎంహెచ్‌వో


రాజేంద్రపాలెం పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమైన డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు

కొయ్యూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీజనల్ జ్వరాలు తీవ్రత అధికంగా ఉన్నందున గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వరనాయుడు వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం డీఎంహెచ్‌వో రాజేంద్రపాలెం పీహెచ్‌సీను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. మందుల నిల్వలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సలహా, సూచనలిచ్చారు. ప్రస్తుతం వైరల్ ఫీవర్స్ వస్తున్నందున క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి స్నేహలత రెడ్డి, సీహెచ్‌వో ప్రశాంత్ కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచకుంటే ఉద్యమం

» ఏపీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మ


మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మ

పాడేరురూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల వేతనాలు పెంచకుంటే ఉద్యమం చేపట్టక తప్పదని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక మోదకొండమ్మ ఆలయంలోని కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షురాలు డి.నాగమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అంగన్‌వాడీల జిల్లా రెండవ మహాసభలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని కోరారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి, చిన్నారి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.చిన్నయ్యపడాల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బీ.పోతురాజు, కె.శంకరరావు, విశాఖ యూనియన్ నాయకులు శోభ, పాడేరు డివిజన్ 11 మండలాల ప్రాజెక్టుల నాయకులు ఈశ్వరమ్మ, భవాని, అమ్మాజీ, బి.సత్యవతి, ఎస్.పార్వతి, మాపూళ్లమ్మ, పాంగి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో వైసీపీ 'అన్నదాత పోరు'

పాడేరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై వైసీపీ ఆధ్వర్యంలో 'అన్నదాత పోరు' పేరిట మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక వీఆర్ పంక్షన్ హాలు నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ, తదితరులు సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం యూరియా పంపిణీలో విఫలమైందని, రైతులకు ఎటువంటి భరోసా కల్పించడం లేదని ఆరోపించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి అప్పలస్వామికి తమ డిమాండ్లపై వినతిపత్రం సమర్పించారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెసా ఉపాధ్యక్షుడిపై చర్యలకు ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

జి.మాడుగుల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సొలభం పంచాయతీ వంజంగిపాగు క్లస్టర్ పెసా కమిటీ ఉపాధ్యక్షుడు లకే రామకృష్ణపై చర్యలు చేపట్టాలని మండల సర్పంచుల ఫోరం నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రామకృష్ణ సర్పంచ్‌ల అనుమతి లేకుండా గ్రామా లు, సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పెసా కమిటీ ఉపాధ్యక్షుడి పేరుతో రికార్డులు తనిఖీలు చేస్తున్నట్టు ఆరోపించారు. గతంలో రామకృష్ణ అనేక మోసాలకు పాల్పడిన సందర్భాలున్నాయన్నారు. ఎం పీడీవో డేవిడ్‌రాజు, ఎంపీపీ అప్పలరాజులకు వినతిపత్రమిచ్చారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్. రామకృష్ణతో పాటు 17 పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పసుపు రైతులకు 75శాతం రాయితీపై యంత్రాలు

» స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ అధికారి కల్యాణి


రైతులనుద్దేశించి మాట్లాడుతున్న కల్యాణి

చింతపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు పసుపు సాగులో ఆధునిక సేద్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని స్పైస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ అధికారి బొడ్డు కల్యాణి అన్నారు. మంగళవారం మండలంలోని తాజంగి పంచాయతీ పినపాడులో రైతులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన కల్యాణి మాట్లాడుతూ రైతులు విత్తన శుద్ధి చేసుకున్న పసుపును నాట్లు వేసుకోవాలన్నారు. దీని వల్ల దుంపకుళ్లు తెగులును నియంత్రించవచ్చునన్నారు. అలాగే, ఎత్తైన నారు మడులు ఏర్పర్చుకుని నాట్లు వేసుకోవాలన్నారు. రైతులు పసుపు తయారీలో యంత్రాలను వినియోగించాలన్నారు. రైతులకు పసుపు ఉడకబెట్టే యంత్రాలు, వాష్, స్లైషర్, పాలీష్ యంత్రాలు 75శాతం రాయితీపై అందజేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్‌బాబు, టాటా ట్రస్టు నిపుణుడు డాక్టర్ అప్పారావు, ఎఫ్‌పీవో సభ్యులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

వీవోఏల వేతనాలు చెల్లించాలని వినతి

జి.మాడుగుల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వెలుగు వీవోఏల బకాయి వేతనలు చెల్లించాలని మంగళవారం సీఐటీఈయూ మండల కో-కన్వీనర్ వి.మహేశ్, వీవోఏల సంఘం అధ్యక్షుడు ఎస్.మత్స్యలింగం కోరుతూ ఏపీఎం ఈశ్వర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఏడాది ఫిబ్రవరి నుంచి వీవోఏల వేతనాల చెల్లించలేదన్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. సమస్య పరిష్కరించకుంటే ఈ నెల 11 నుంచి ధర్నా కార్యక్రమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దేవినాయుడు, లక్ష్మణ్, సింహాచలం, వీవోఏలు పాల్గొన్నారు.

చింతపల్లి ఎంపీడీవోగా హనుమంతరావు



చింతపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవోగా ఎన్. హనుమంతరావు నియమితులయ్యా రు. చింతపల్లి ఎంపీడీవో పోస్టు కొంతకాలంగా ఖాళీగావున్నది. ఈ స్థితిలో డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మికి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యలను జిల్లా పరిషత్ అధికారులు అప్పగించారు. రెండు నెలలుగా ఆమె ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా పూర్తి స్థాయి ఎంపీడీవోని జడ్పీ అధికారులు నియమించడంతో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభ


విజ్ఞాన వేదిక నూతన కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల ప్రాంగణంలో మంగళవారం జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభను ఘనంగా నిర్వహించినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి యండమూరి పారయ్య తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో జాన్ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం కలిగించాలని, మాదక ద్రవ్యాలు వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మూఢనమ్మకాల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని నింపాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. అనంతరం నిర్వహించిన జన విజ్ఞాన వేదిక జిల్లా ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా కేవీ రామేశ్వరం, ప్రధాన కార్యదర్శి యండమూరి పారయ్య, కోశాధికారిగా పి.లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హైడ్రో ప్రాజెక్టు నిర్మాణ పనులు తగవు'


జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో అక్రమ పలు గ్రామాల సరిహద్దులో స్తంభాలను ఏర్పాటు చేసిన నవయుగ కంపెనీపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స ఆధ్వర్యంలో గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌కు చేశారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ చిట్టంవలస, గుజ్జిలిలో పవర్ ప్రాజెక్టు పేరుతో గిరిజనుల భూములపై అక్రమంగా సరిహద్దు దిమ్మలు నిర్మించారన్నారు. గిరిజన చట్టాలు, హక్కులను ఉల్లంఘిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు డి.గంగరాజు, లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, గిరిజన సంఘం నాయకులు పి.బాలదేవ్, టి.కృష్ణారావు, కె.రామారావు, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ కన్వీనర్ కృష్ణరాజు, బొంజుబాబులున్నారు.

డీఆర్‌డీవోలు, ఆశ్రమ పాఠశాలలు తనిఖీ


నిన్నిమామిడి అంగన్‌వాడీ కేంద్రంలో పులిహోరను రుచిచూస్తున్న సభ్యుడు కాంతారావు, తదితరులు

అనంతగిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని అనంతగిరి, బొర్రా పంచాయతీ పరిధిలోగల అంగన్‌వాడీలు, డీఆర్ డిపోలు, పాఠశాలను మం గళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.. ముందుగా అనంతగిరి డీఆర్ డిపో, బొర్రా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మెనూ పరిశీలించి, డీ ఆర్‌డిపోను తనిఖీ చేసి, స్టాక్‌పై ఆరా తీశారు. నిన్నిమామిడి అంగన్‌వాడీలో పులిహోరను రుచి చూసి సంతృప్తి చెందారు. అనంతగిరి బాలికల-2 పాఠశాలలో తనిఖీ చేశారు. హెచ్ఎం మంగమ్మ పాల్గొన్నారు. పెద్దూరు ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయ్, సివిల్ సప్లై డీఎస్‌వో పి.మోహన్‌బాబు, ఫుడ్‌సెఫ్టీ అధికారిణి గ్రీష్మ, సివిల్ సప్లై డీటీ ప్రశాంత్‌కుమార్, లైజనింగ్ అధికారి (ఎంపీడీవో) తేజ, తహసీల్దార్ వీరభద్రచారి, డీటీ మాణిక్యం, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవోలు కిల్లో బాలాజీ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు ఏర్పాట్లు

పాడేరురూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ఉన్న పూర్ణ పుష్కలాంబ సహిత అయ్యప్ప స్వామి ఆలయంలో కొలువై ఉన్న మహాలక్ష్మి దేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 22వ తేదీ సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ గురువారం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు తెలిపారు. నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు భక్తులకు 11 అవతారాల్లో దర్శనమిస్తారన్నారు. భక్తులు దర్శించుకోవాలని కోరారు.

వాహన తనిఖీలు

డుంబ్రిగుడ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పక నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్ఐ పాపినాయుడు చెప్పారు. ఆయన మంగళవారం మండల కేంద్రలోని ఏకలవ్య పాఠశాల ఎదుట అరకు-పాడేరు ప్రధాన రహదారిలో వాహనాలను విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అంతే కాకుండా వాహనదారులు గంజాయి,నాటుసారా రవాణా చేయరాదన్నారు. వాహనాల రికార్డులు చెంతనే ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు దిగుబడులపై అవగాహన

పాడేరురూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పసుపు దిగుబడులు సాధనపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఎన్ఎస్ఎస్‌పీ రిసోర్స్ పర్సన్ శ్యాం సుందర్ రెడ్డి సూచించారు. స్మైల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్‌పీ వారి సహకారంతో 75 మంది పసుపు రైతులకు, జోడ్ల ఎఫ్‌పీవో పరిధిలోని రైతులకు మంగళవారం పసుపు దిగుబడులపై అవగాహన కల్పించారు. పసుపు పంటకు నేల సిద్ధం చేయడం నుంచి పంట కోత చేసి మార్కెటింగ్ చేసే వరకు పాటించాల్సిన సేంద్రియ సాగులో మెలకువలను వివరించారు. పసుపు సాగుకు సంబంధించి రూపొందించిన డైరీలను రైతులకు అందించారు. కార్యక్రమంలో స్మైల్ సంస్థ డైరెక్టర్ మురళీ, రిసోర్స్‌పర్సన్ రవికుమార్, రోజీ, గంగతల్లి, రవికుమార్ ప్రకృతి వ్యవసాయం, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ , అటవీ చట్టాలపై రైతులకు వివరించారు.

17 నుంచి సేవా పక్షోత్సవాలు: బీజేపీ



జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి వరకు జరగనున్న సేవా పక్షోత్సవాలను ఘ నంగా నిర్వహించాలని బీజేపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కోరారు. జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి అధ్యక్షతన స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 15 రోజులపాటు రక్తదానం, వైద్య శిబిరాలు, ఆస్పత్రులు, దేవాలయాలు, పాఠశాలల పరిసరాలు శుభ్రం చేయడం తదితర కార్యక్రమాలను చేపట్టాలన్నారు. బీజేపీ నాయకులు పుట్టా గంగయ్య, పి.రవికుమార్, స్వప్నకుమారి, ఎస్.రామచందర్, పి.రాజారావు, సల్లా రామకృష్ణ, కె.కృష్ణారావు, వి.దేవదాస్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి


రామకృష్ణ (ఫైల్‌ఫొటో)

కొయ్యూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బూదరాళ్ల ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు గోకిరి రామకృష్ణ (50) అనారోగ్యంతో విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. మూత్ర పిండాలకు సంబంధిత సమస్యతో బాధపడుతున్న రా మకృష్ణను వారం రోజుల క్రితం కుటుంబీకులు విశాఖపట్నం తరలించారు. సోమవారం రాత్రి అతని దాటాక ఆరోగ్య పరిస్థితి విషమించి మరణించాడు. రామకృష్ణకు భార్యతో పాటు కొడుకు, కుమార్తె ఉన్నారు. భార్య గతంలో రాజేంద్రపాలెం సర్పంచ్‌గా చేశారు. ఎంఈవో రాంబాబుతో పాటు ఉపాధ్యాయులు రాజేంద్రపాలెంలోని స్వగృహానికి వెళ్లి కుటుంబీకులను ఓ దార్చి ఘనంగా అతని భౌతిక కాయానికి నివాళులర్పించారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి: జిల్లా అధికారి


వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ కిరణ్ కుమార్

చింతపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు క్షయపై అప్రమత్తంగా ఉండాలి జిల్లా కుష్ఠు, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం. కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం చింతపల్లి, జీకే వీధి మండలాల్లో ఆయన పర్యటించారు. జర్రెల, కోరుకొండ పీహెచ్‌సీలు, హెల్త్, వెల్‌నెస్ సెంటర్లను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రెండు వారాలు దగ్గు, జ్వరం కలిగి ఉంటే కఫం పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రసాద్, నగేశ్ , చిట్టిబాబు పాల్గొన్నారు.

తాజంగిలో వ్యర్థాల తొలగింపు

చింతపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి జలాశయంలో పేరుకుపోయిన వ్యర్థాలను మిషన్ తాజంగి సభ్యులు (యువకులు) శ్రమదానం చేసి తొలగించారు. తాజాగా వినాయక చవితి నిమజ్జనం పురస్కరించుకుని భక్తులు భారీ ఎత్తులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఈ విగ్రహాలతోపాటు చెత్తా చెదారాలు తొలగించారు. మిషన్ తాజంగి అధ్యక్షుడు శెట్టి శంకర్, యువకులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ కమిటీ ఎన్నిక


ఉత్సవ కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆల యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీని మంగళవారం ఎంపిక చేసినట్టు ఆలయ కమిటీ ప్రతినిధి కొట్టగుళ్లి సుబ్బారావు తెలిపారు. కమిటీ గౌరవాధ్యక్షులుగా కొట్టగుళ్లి సుబ్బారావు, రొబ్బి రాము, డొంకిన నాగు, అధ్యక్షుడిగా వియ్యపు వెంకట్, కార్యదర్శులుగా బుజ్జి, బండారు మాణిక్యం, కోశాధికారిగా అప్పారావు, ఉపాధ్యక్షులుగా గబ్బంగి ప్రసాద్, కొట్టగుళ్లి మత్స్యరాజు, మోద ప్రసాద్, కె.రవి, షార్‌ఖాన్, డి.వెంకటరమణ, సంజీవ్, నాయుడు ఎంపిక చేశామన్నారు.

పీఏసీఎస్‌కు స్థలాన్ని అప్పగించాలి


తహశీల్దార్‌కు విన్నతి పత్రం అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

హుకుంపేట సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల వ్యవసాయ కో ఆపరేటివ్ సంఘానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని అప్పటించాలని అధికారులను సొసైటీ చైర్‌పర్సన్‌ను కిల్లో మోహన్ దాసు కోరారు. మంగళవారం పీఏసీఎస్ సభ్యులు, డైరెక్టర్‌తో కలిసి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోఆపరేటివ్ సొసైటీకి గతంలోని సర్వే నంబరు 71/1లో ఉన్న 15 సెంట్లు సర్వే నిర్వహించి అప్పగించాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు వ్యవసాయ రుణాలు, సబ్సిడీపై ఎరువులు అందిస్తోందన్నారు. ఈనేపథ్యంలో సొసైటీ కి స్థలం అవసరమన్నారు. కార్యక్రమంలో సభ్యు లు బాలన్న సరస్వతి, సొసైటీ సీఈవో అప్పలనాయుడు, కృష్ణంరాజు నైని సత్తిబాబు, సరేశ్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో గందరగోళం

» ధారకొండలో అధికారులతో రైతులు వాగ్వాదం

» పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని డిమాండ్

» చేసేదిలేక సరఫరా నిలిపేసి వెనుదిరిగిన అధికారులు


రైతు సేవా కేంద్రంలో అధికారులను నిలదీస్తున్న దృశ్యం

సీలేరు, సెప్టెంబరు 9, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండలో మంగళవారం మూడు పంచాయతీల గిరిజన రైతులు యూరియా కోసం పడిగాపులు పడినా చివరికి యూరియా పంపిణీ జరగలేదు. దీంతో గందరగోళనం నెలకొంది. మండలానికి ప్రభుత్వం 267 బస్తాల సరఫరా అయ్యాయి. వీటిలో 90 బస్తాలను మండల కేంద్రంలో సరఫరా చేశారు. మిగతా 177 బస్తాలను ధారకొండ రైతు సేవా కేంద్రానికి తరలించారు. మంగళవారం ధారకొండలో దుప్పులవాడ, గుమ్మిరేవుల, ధారకొండ మూడు పంచాయతీల రైతులకు యూరియా పంపిణీ చేస్తారన్న సమాచారం మేరకు ఉద యం తొమ్మిది గంటలకే రైతులు రైతు సేవా కేంద్రం వద్దకు చేరుకున్నారు. గంటల తరబడి మండుటెండలో వేచి ఉన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు మండల వ్యవసాయాధికారి గిరిబాబు రావడంతో స్థానిక సర్పంచ్ రాజు సమక్షంలో యూరియా పంపిణీకి సిద్ధం చేశారు. ప్రస్తుతం 177 యూరియా బస్తాలు మాత్రమే వచ్చాయని, వీటిని మూడు పంచాయతీలకు వచ్చిన మేరకు పంపిణీ చేసి , మిగతా వారికి మరో 20 రోజుల తరువాత ప్రభుత్వం నుంచి వచ్చే యూరియాను అందిస్తామని ఏవో చెప్పారు. ఈస్థితిలో సుమారు 750 మంది రైతులు ఇక్కడి వచ్చారని, ఈ బస్తాలను ఎలా సర్దుబాటు చేస్తాంటూ రైతులు ఆందోళన చేశారు.దీంతో స్థానిక ఎస్ఐ రవీంద్ర సర్ది చెప్పారు. పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేయడంతో వ్యవసాయ అధికారులు యూరియా సరఫరా చేయకుండా వెనుదిరిగారు.

రుత్తల లచ్చాపాత్రుడు 43వ వర్ధంతి


నివాళులు అర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తాత రుత్తల లచ్చాపాత్రుడు 43వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్పీకర్ కుటుంబ సభ్యులతో కలిసి లచ్చాపాత్రుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు డీఈవో అభినందనలు


ఉపాధ్యాయులు డీజీనాథ్, నాగజ్యోతితో డీఈవో

నర్సీపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావునాయుడు అభినందించారు. డీఈవో కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న డీజీనాథ్, నాగజ్యోతిలను మంగళవారం ఆయన ప్రశంసించారు.

తప్పిపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం


మృతి చెందిన ఈశ్వరరావు (ఫైల్‌ఫొటో)

బుచ్చెయ్యపేట సెప్టెంబర్ 9(ఆంధ్ర జ్యోతి) మండలంలో గంటి కొర్లాం శివారు భట్లోవ చెరువు వద్ద మంగళవారం మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహం పి. భీమవరం శివారు శ్రీరామపురానికి చెందిన పాతరపల్లి ఈశ్వరరావు (60)గా గుర్తించారు. గత నెల 30 నుంచి ఆయన కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదైంది. మంగళవారం గంటి కొర్లాం శివారు చెరువు వద్ద ఆయన శవమై కనిపించారు. మతిస్థిమితం లేక ఇంటి నుంచి వెళ్లి పోయిన ఆయన గత కొద్ది రోజులుగా ఆహారంలేక చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహనికి పోస్టు మార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రెండో వైద్యాధికారిని నియమించాలి


కొత్తకోట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రావికమతం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట పీహెచ్‌సీకి రెండవ వైద్యాధికారిని నియమించాలన్న డిమాండ్‌తో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, ఏజెన్సీ గిరిజన గ్రామాలకు ఆధారంగా ఉన్న కొత్తకోట పీహెచ్‌సీలో ఉన్న ఇద్దరు వైద్యాధికారుల్లో ఒక్కరిని మూడు నెలల క్రితం బదిలీ చేశారన్నారు. పీహెచ్‌సీ పరిధిలో సుమారు 40 గ్రామాలకు గాను వీటిలో 25 గిరిజన గ్రామాలున్నాయన్నారు.దీంతో ఒక్కరే డాక్టరుఉండటంతో సేవలందించలేకున్నారన్నారు.

అయ్యన్న కాలనీలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్

- అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపునకు పోలీసుల తనిఖీలు
- రికార్డులు లేని 18 వాహనాలు స్వాధీనం


కార్డెన్ సెర్చ్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ

నర్సీపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని అయ్యన్న కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు, పోలీసు జాగిలాలతో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. అయ్యన్నకాలనీ, నీలంపేటలో విస్తృతంగా తనిఖీలు చేశారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వలు కనిపెట్టడానికి, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడానికి ఈ తనిఖీలు నిర్వహించారు. కాలనీలోని వాహనాల రికార్డులు పరిశీలించారు. అక్రమ మద్యం నిల్వలు గురించి షాపులలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు లేని 18 వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, పట్టణ, రూరల్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో భారీ వర్షం


కృష్ణాదేవిపేటలో బస్‌స్టేషన్ వద్ద పడుతున్న వర్షం

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం, కొంగశింగి, సిహెచ్.నాగాపురం, లింగంపేట, గింజర్తి, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం పడింది. ఎండతో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో సేదదీరారు. అంతేకాకుండా ఎండుతున్న వరి పొలాలు, నారుమడులు, పత్తి, మిరప తదితర పంటలకు ఈ వర్షం మరింత ఊరటనిచ్చింది. దీంతో ఖరీఫ్, రబీ సాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో ఎరువులు

గొలుగొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. చీడిగుమ్మల గ్రామంలో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయాల్లోని రైతు సేవా కేంద్రాల్లో కాంప్లెక్స్ ఎరువులతో పాటు యూరియా సిద్ధం ఉన్నట్టు చెప్పారు. మండలంలోని ఇప్పటివరకు 350 టన్నుల యూరియా రైతులకు అందించామన్నారు. ఈ ఖరీఫ్‌కు సరపడా యూరియాను ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సుధారాణి, నాయకులు కామిరెడ్డి గోవింద్, రైతులు పాల్గొన్నారు.

16న ఓజోన్ డే ర్యాలీ


కరపత్రాన్ని ఓపెన్ చేస్తున్న స్పీకర్

నర్సీపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓజోన్ డే సందర్భంగా గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న అవగాహన ర్యాలీ చేపడుతున్నారు. ఈ మేరకు క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం ఓజోన్ డే కరపత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ అధ్యక్షుడు డీజీనాథ్, కేవీ రమణ, అడిగర్ల వరహాలనాయుడు, రమణమూర్తి, సుగుణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

యూరియా కొరతపై వైసీపీ అన్నదాత పోరు


సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సుధాకర్‌కి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై వైసీపీ అన్నదాత పోరు కార్యక్రమం చేపట్టింది. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ ధర్నా చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సుధాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ నియోజకర్గంలో 25 వేల ఎకరాలలో వరి వేస్తే సగం మంది రైతులకు యూరియా సరపరా చేయలేదని విమర్శించారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూరల్ సీఐ రేవతమ్మ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసిపాత్రుడు, కౌన్సిలర్లు బుల్లిదొర, సిరసనపల్లి నాని, పార్టీ అధ్యక్షుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో శానిటరీ న్యాప్కిన్ మిషన్

నర్సీపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు తెలిపారు. ఇటీవల 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించినప్పుడు విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు వినతి మేరకు సొంత నిధులతో రెండు మిషన్లు ఇచ్చారని చెప్పారు. మంగళవారం న్యాప్కిన్ వెండింగ్ మిషన్లు ప్రారంభించి అందుబాటులోకి తెచ్చారని ఆయన తెలిపారు.

గునుపూడి ఫీల్డ్ అసిస్టెంట్‌పై కమిషనర్‌కు ఫిర్యాదు

నాతవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుపూడి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై దొంగ మస్తర్లు వేస్తున్నారని పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దొంగ మస్తర్లపై విచారణ చేయాలని ఏపీడీ మణికుమార్‌కు ఫిర్యాదు చేశామని, తమకు తెలియకుండా గునుపూడి వచ్చి రాజకీయ నాయకులతో మాట్లాడి స్టేట్‌మెంట్ తీసుకుని వెళ్లిపోయారని ఫిర్యాదుదారు తెలిపారు. ఏపీడీ చేసిన విచారణపై తనకు అనుమానం ఉందని, దీనిపై ఏం చర్య తీసుకున్నారో, ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఎందుకు తొలగించలేదో తనకు తెలపాలని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో ఫిర్యాదుదారుడు నాగు కోరారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మోదకొండమ్మ అ మ్మ వారి ఆలయంలో మంగళవారం కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

వాహనమిత్ర అమలుచేయాలని ధర్నా

నర్సీపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకాన్ని ప్రకటించాలని పాత బస్టాండ్‌లో మంగళవారం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు ముందే వాహనమిత్ర పథకాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్త్రీ శక్తి పథకంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. వాహన మిత్ర పథకం అమలు చేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

గొలుగొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన బదిలీపై వెళ్తున్న పద్మజ, సునీల్‌కుమార్‌లను గ్రామస్థులు మంగళవారం సన్మానించారు. ఇక్కడ విద్యార్థులకు విద్యాపరంగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు గోపీనాథ్, వరహాలబాబు, బాలకృష్ణ, కొల్లు సత్యనారాయణ, కిలపర్తి పెద్దిరాజు, కొల్లు లోవరాజు పాల్గొన్నారు.

రైతులతో సమావేశం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జిల్లా వ్యవసాయధికారి బి.మెహనరావు, సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులకు అందిస్తామన్నారు. అలాగే, యూరియా అధికంగా వాడటం వలన తెగుళ్లు, చీడ పీడలు, వ్యాప్తిస్తాయని తెలిపారు.

క్వారీ పేలుళ్లతో దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన


రాజన్నపేటలో ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగమ్మ,ఆర్ఐ తదితరులు

రోలుగుంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజన్నపేట క్వారీ బ్లాస్టింగ్‌లతో గ్రామంలో దెబ్బతిన్న ఇళ్లను తహసీల్దార్ నాగమ్మ మంగళవారం పరిశీలించారు. క్వారీ పేలుళ్లతో పడుతున్న ఇబ్బందులపై ఆర్డీఓకు మీకోసంలో ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా తహసీల్దార్ నాగమ్మ, ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో తదితరులు క్వారీ ప్రాంతాన్ని పరిశీలించి అనంతరం గ్రామాన్ని సందర్శించారు. బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న ఇళ్లను స్వయంగా పరిశీలించారు. తమ గ్రామానికి 650 మీటర్ల దూరంలోనే క్వారీని ఏర్పాటు చేశారన్నారు. క్వారీ యాజమాన్యం నిర్వహించే పరిమితికి మించి బ్లాస్టింగ్‌లతో ఇళ్ల సన్‌షేడ్‌లు, గోడలు బీట వారుతున్నాయని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే, దుమ్ము, ధూళి కాలుష్యంతో పలువురు శ్వాసకోశ వ్యాధుల బారిన పడ్డారని పలువురు పేర్కొన్నారు. ఇళ్లు దెబ్బతిన్న బాధితుల నుంచి వివరాలు సేకరించారు. నివేదికను కలెక్టర్, ఆర్డీఓకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదు దారులు ఇర్ల రాంబాబు, నువ్వల సత్తిబాబు, మాజీ జడ్పీటీసీ బోనంగి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మన డబ్బులు- మన లెక్కలు' యాప్‌పై అవగాహన


సమావేశంలో యాప్ చూపుతున్న అధికారులు

బుచ్చెయ్యపేట సెప్టెంబర్ 9 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో మూడు మండలాలకు చెందిన సీసీలు, వీవోఏలు, మండల సమాఖ్య, గ్రామ సంఘాల సిబ్బందికి , మన డబ్బులు- మన లెక్కలు' యాప్ పై అవగాహన కల్పించారు. మహిళా సంఘ సభ్యుల ఆర్థిక లావాదేవీలు, రుణాలు చెల్లింపు తదితర అంశాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఫిర్యాదులు యాప్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ శచిదేవి, డీపీఎం సంస్థలకు చెందిన పి.వెంకట రమణ. మూడు మండలాల ఏపీఎంలు రాజుబాబు,బి రమణి కుమారి, కళ్యాణి, సీసీలు, సీఏలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై శ్రద్ధ అవసరం: ఐసీడీఎస్ పీడీ


మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి, తదితరులు

కె.కోటపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాలింతలు, గర్భిణులు ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి అన్నారు. మంగళవారం కోటపాడు లోని మూడు అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. మిషన్ శక్తి కార్యక్రమంలో సంకల్ప ప్రోగ్రాం ద్వారా తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించే ఈసీసీఈ మెసేజ్‌లను టీవీకి కనెక్ట్ చేసి పిల్లలతో పలికిస్తున్నామన్నారు. బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీలు తదితర విషయాల పై తల్లులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పి. లలితకుమారి, సూపర్‌వైజర్ ఎల్‌బి సుశీల, కోటపాడు ఒకటి, రెండు, మూడు అంగన్‌వాడీ వర్కర్స్ కుమారి, లక్ష్మి, గౌతమి, హెల్పర్స్ కాసులమ్మ, మణి, మహిళా పోలీసు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధనలు

మాడుగుల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంగళవారం శ్రీ వెంకట మోదమాంబ కళాసీ యూనియన్ ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి సమీపంలో ఆ యూనియన్ సభ్యులు, మూడురోడ్ల కూడలిలో గల భాల వినాయకుడు దగ్గర అక్కడ కమిటీ సభ్యులు పర్యవేక్షణలో భారీ అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

పీఏసీఎస్‌ను లాభాల బాటలో నడిపించాలి

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి


డైరెక్టర్ సత్యారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తూ సహకార సంఘాన్ని లాభాల బాటలో నడిపించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. ఇటీవల దేవరాపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన పూడి సత్యారావు సన్మాన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌గా గొంతిన నర్సింహనాయుడును సత్కరించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో మహిళా సంఘానికి మంజూరైన చెక్కును అందజేశారు. అలాగే, స్థానిక మోడల్ కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎ మ్మెల్యే మంగళవారం ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈభవనం మంజూరు చేశామన్నారు. అనంతరం రైవాడ ఉప కేంద్రం పరిధిలోని గిరిజన గ్రామాలకు మంజూరైన దోమ తెరలను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, రైవాడ జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, చెరకాన సూర్యనారాయణ, సర్పంచ్ పెంటమ్మ, కాశీపురం సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, జనసేన మండల అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనంత ఉ మాదేవి, తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా కాలనీలో వైద్య శిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది , నాయకులు

చోడవరం, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరాకాలనీలో ఎమ్మె ల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు ఆదేశాల మేరకు మంగళవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీలో జ్వరపీడితులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి పరీక్షలు నిర్వహించారు. అలాగే వర్షాలు పడుతున్నందున వేడినీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండి నూకాలమ్మ, దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీను, బాలిబోయిన దేముడు, బొబ్బిలి ఈశ్వరరావు. టీడీపీ జిల్లా ఎస్‌సీ సెల్ అధ్యక్షులు ఎలకా మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కొట్టాపు చిన్న, జోగినాయుడు, గుమ్మాల సత్య, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల మార్చుతున్నందున బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.ఎస్. అప్పారావు తెలిపారు. కె.కోటపాడు, గొండుపాలెం, కింతాడ, దాలివలస, మర్రివలస, గొట్లాం, కె. సంతపాలెం, మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, పైడంపేట, వారాడ, పెంద్రంగి, ఆనందపురం, ఆర్‌వై అగ్రహారం, కోడూరుల్లోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆటో కార్మికుల నిరసన


కె.కోటపాడులో వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

కె.కోటపాడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభు త్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో వీధిన పడిన తమను ఆదుకోవాలని మంగళవారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఆటో డ్రైవర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మూడు వైపులా రోడ్డుకు ఆటోలు నిలుపుదల చేసి ట్రాఫిక్‌ను దిగ్బంధించారు. ఈ సందర్భంగా ఆటో యూ నియన్ నాయకులు ఎ.దేవుడుబాబు, వంటాక రామకృష్ణ, మొల్లి అప్పలనాయుడు మాట్లాడుతూ ఆటో ద్వారా కుటుంబాలను నెట్టుకొస్తున్న ఎంతో మంది డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్‌చేశారు. ధర్నా తో అరగంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బుచ్చెయ్యపేట: మండలంలో మంగళవారం వడ్డాది గ్రామంలో ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. వడ్డాది నుంచి చోడవరం చేరుకునే ప్రయాణికులు గౌరీపట్నం మీదుగా సింగిల్ రోడ్డులో ఆటోలను ఆశ్రయించాలి. మంగళవారం ఆటో డ్రైవర్లంతా అనకాపల్లి కలెక్టరేట్‌లో ధర్నాకు మద్దతుగా గ్రామంలో కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. ఫలితంగా విద్యార్థులు, వ్యాపారులు, రోజువారి కూలీలు, వివిధ వర్గాలకు చెందిన వారికి అవస్థలు తప్పలేదు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ ప్రతినిధులు కోవెల వెంకట రమణ, వెలుగుల నాగేశ్వరరావు, నాళం వెంకటరమణ మాట్లాడుతూ, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఉపాధి కోల్పోయామన్నారు. సీఎం చంద్రబాబు, స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ర్యాలీగా అనకాపల్లి కలెక్టర్‌కు తరలివెళ్లారు.

వైసీపీ నేతల గృహ నిర్బంధం


చోడవరం ఎంపీపీ గాడి కాసు ఇంటి వద్ద బందోబస్తులో ఉన్న పోలీసులు

చోడవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా, ఇతర ఎరువులు పంపిణీలో ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా మంగళవారం జిల్లా కలెక్టరేట్‌ల వద్ద వైసీపీ తలపెట్టిన ఆందోళన నేపథ్యంలో ఆ పార్టీ ముఖ్య నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. స్థానిక ఎంపీపీ గాడి కాసు, గాడి అప్పారావుతో పాటు, ముఖ్య నేతలు పుల్లేటి వెంకటేష్, పందిరి శ్రీను, నెహ్రూ తదితరుల ఇళ్ల వద్ద పోలీసులు మంగళవారం తెల్లవారు జాము నుంచి మకాం వేసి అనకాపల్లి వెళ్లకుండా అడ్డుకున్నారు. దేవరపల్లి సత్య, బైన ఈశ్వరరావు, వెంపలి ఆనంద్, గూనూరు రాజు తదితరులు అనకాపల్లి వెళ్లి వైసీపీ నేతల ఆందోళనలో పాల్గొన్నారు.

రావికమతం: రావికమతం, కొత్తకోట ఎస్‌ఐలు రఘువర్మ,శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తమై మంగళవారం తెల్లవారు నుంచే వైసీపీ నాయకులను ఇళ్ల నుంచి పైకి రాకుండా చూశారు. ఎంపీపీ పైల రాజును తోటకూరపాలెంలో, వైసీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడును రావికమతంలో, కొమిర, కేబీపీ అగ్రహారం, గొంప సర్పంచ్‌లను వారి ఇళ్ల వద్ద అరెస్ట్ చేశారు. డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవా, కొత్తకోట సర్పంచ్,ఉప సర్పంచ్‌లు కోన లోవరాజు, పందల దేవలను కొత్తకోట ఎస్‌ఐ శ్రీనివాస్ రైతు పోరు బాటకు వెళ్లకుండా కొత్తకోటలో అడ్డగిచడంతో ఎస్‌ఐతో వారు వాగ్వాదానికి దిగారు. ఎస్‌ఐ దీనికి అనుమతులు లేనందున వెనక్కి వెళ్లాలని ఆయన తెలిపారు. దీంతో నాయకులు రోడ్డుపై నినాదాలు చేసి వెనుతిరిగారు.

బుచ్చెయ్యపేట: వడ్డాది గ్రామంలో జడ్పీటీ సభ్యుడు దొండా రాంబాబుతోపాటు పలువురు వైసీపీ నాయకులను పోలీసులు గృహ నిర్బంధించారు. వైస్ ఎంపీపీ-1 చినబాబుని, వైస్ ఎంపీపీ -2 దొండా లలితా నారాయణమూర్తిని, వైసీపీ మండల అధ్యక్షుడు కొలిమల్ల అచ్చింనాయుడుని, జోగా కొండబాబుని, నమ్మి అప్పలరాజుని హౌస్ అరెస్టు చేశారు. సర్పంచ్ మరిశానాని, ఆదట్రావు సత్యనారాయణలను అనకాపల్లి వెళ్తుండగా రాజాం పెట్రోల్ బంక్ వద్ద అపి నోటీసులు అందచేసి వెనక్కి పంపించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఏ ఎస్‌ఐ భాస్కరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రావికమతంలో వైసీపీ నేతలను అడ్డుకున్న ఎస్‌ఐ

మాడుగుల : అనకాపల్లిలో నిర్వహించిన పోరు బాట కారక్రమానికి బయలుదేరిన స్థానిక జడ్పీటీసీ సభ్యులు కిముడు రమణమ్మ, ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, వైస్ ఎంపీపీ పొలిమేర విజయలక్ష్మి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీను, ఎం కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుని అడ్డుకొని పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

పాఠశాలలకు రూ.17 లక్షల నిధులు విడుదల: బండారు

కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లోని పది పాఠశాలలకు సర్వ శిక్ష అభియాన్ నిధులు 170 లక్షలకుపైగా మంజూరైనట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు తెలిపారు. ఈ నిధులు పాఠశాలలో ల్యాబ్ ఎక్యుప్‌మెంట్, టాయిలెట్స్‌కు వినియోగించాలన్నారు. కోటపాడు మండలానికి 61.375 లక్షలు, మాడుగులకు 76.95 లక్షలు, చీడికాడ మండలానికి 16లక్షలు, దేవరాపల్లి మండలానికి 16.45 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బండారు చెప్పారు.


అజయ్‌పురంలో ఒక్కరికి మలేరియా



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి సురేఖ

రావికమతం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమల పాడు పంచాయతీ శివారు అజయ్‌పురంలో ఒక్కరికి మాత్రమే మలేరియా నిర్ధారణ అయినట్టు కొత్తకోట పిహెచ్‌సి వైద్యాధికారి సురేఖ తెలిపారు. మంగళవారం ఈ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 20 మంది హాజరుకాగా వీరిలో జ్వర లక్షణాలున్న ఎనిమిది మందికి ఆర్‌డీటీ వైద్య పరీక్షలు నిర్వహించగా ఒక్కరికి మాత్రమే మలేరియా నిర్ధారణ అయినట్టు వైద్యాధికారి సురేఖ తెలిపారు. జ్వర పీడితులకు అవసరమైన మందులు అందజేశామన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమ తెరలను తప్పని సరిగా వినియోగించాలని గిరిజనులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు,ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి గ్రానైట్స్ విరాళం


గ్రానైట్ పలకలు వాహనం నుంచి దించుతున్న సభ్యులు .

బుచ్చెయ్యపేట సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి వడ్డాడిలో నిర్మాణంలో ఉన్న శ్రీ కృష్ణ ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విలువైన గ్రానైట్ పలకలను టీడీపీ టౌన్ అధ్యక్షుడు, పంచాయతీ వార్డు మెంబరు దొండా నరేశ్‌లు సొంత నిధులతో మంగళవారం కొనుగోలు చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కురందాసు మాలిబాబు, కమిటీ సభ్యులు నరేష్‌ను అభినందించారు, మరింతమంది దాతలు సహకరించాలని కోరారు.

బతికి చూపించు!


ప్రాణాల మీదకు తెస్తున్న క్షణికావేశం

ఛిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు

దేశంలో ఏటా లక్షల మంది బలవన్మరణ యత్నం

- గత ఏడాదితో పోలిస్తే రెండు శాతం పెరిగిన ఆత్మహత్యలు
- యువతలో చదువు, ఒత్తిడి, ప్రేమ వ్యవహారాలే కారణాలు
- మధ్య వయసు వారిలో వివాహేతర సంబంధాలు, అనుమానాలు, ఆర్థిక అంశాలు
- వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు, ఒంటరితనం
- ప్రతి నాలుగింటిలో మూడు నిలువరించే అవకాశం

నేడు ఆత్మహత్యల నివారణ దినం



విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): **మార్కులు తగ్గాయని.. ఆర్థిక ఇబ్బందులున్నాయని, పంట చేతికి రాలేదని, భర్త అనుమానించాడని, ర్యాంకులు రాలేదని, వ్యాపారంలో నష్టాలు వచ్చాయని, ఉద్యోగపరమైన ఒత్తిడి పెరిగిందని.. ఇలా కారణాలు ఏవైనా దేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గత పదేళ్లలో 35 శాతం మేర ఆత్మహత్యలు పెరిగినట్టు నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది ప్రతి లక్ష మందిలో పది నుంచి 11 మంది ఆత్మహత్యకు యత్నించినట్టు తేలింది. ఈ ఏడాది మరో రెండు శాతం పెరిగినట్టు చెబుతున్నారు. యువత బలవన్మరణాలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. నేడు అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.**

ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలను నివారించే ఉద్దేశంతో 2003 నుంచి ఆత్మహత్యల నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్ (ఐఏఎస్‌పీ) భిన్న కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. ఈ ఏడాది ఛేంజింగ్ ద నెరేటివ్ ఆఫ్ సూసైడ్ థీమ్‌తో నిర్వహిస్తున్నారు. అంటే, ఆత్మహత్యలను చూసే దృక్పథంలో మార్పు రావాలని ఉద్దేశం.

దేశంలో ఏటా 1.8 లక్షల మంది..

దేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఏటా ప్రపంచవ్యాప్తంగా 7.2 లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటుండగా, దేశంలో 1.8 లక్షల మంది మృతి చెందుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మరో 25 లక్షల మంది ఆత్మహత్య ప్రయత్నం చేసినట్టు చెబుతున్నారు. వారిలో ప్రతి 20 మందిలో ఒకరు మృతి చెందుతున్నట్టు తేలింది.

ఇవీ కారణాలు..

ఆత్మహత్యలకు అనేక అంశాలు కారణం. ఇందులో ప్రధానమైనది డిప్రెషన్. ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ పరమైన ఒత్తిడి, ప్రేమ వైఫల్యం, కుటుంబ తగాదాలు. డిప్రెషన్‌తో బాధపడే వ్యక్తుల తరువాత ఆలోచన ఆత్మహత్య. ఈ దశలో గుర్తించడం కీలకం. కౌన్సెలింగ్, యాంటీ డిప్రెషన్ థెరపీ, సైకో థెరపీతో సాధారణ స్థితికి తీసుకురావచ్చు. ప్రతివంద ఆత్మహత్యల్లో 30 మంది 10 నుంచి 30 ఏళ్లలోపు వారుంటే, 30 నుంచి 50 ఏళ్లలోపు వారు 50 మంది, 50 నుంచి 70 మధ్య 15 శాతం, 70 ఏళ్ల పైబడిన వారిలో మరో ఐదు శాతం మంది ఉన్నారు.

అప్రమత్తం కావాలి..

ఆత్మహత్య ఆలోచనలున్న వ్యక్తుల్లో కొన్ని లక్షణాలుంటాయి. వాటిని గుర్తిస్తే అడ్డుకోవచ్చు జీవితం పట్ల హోప్ లేకుండా మాట్లాడడం, నిరాశ, నిస్పృహ, ఒంటరిగా ఉండడం, నిద్ర రాకపోవడం, ఎవరితోనూ కలవకపోవడం, గదికే పరిమితం కావడం. వీరిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పిస్తే జీవితంపై భరోసా కల్పించవచ్చు.

క్షణికావేశంలోనే అధికం..

ఇటీవల క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోంది. తండ్రి కొట్టాడనో, భర్త తిట్టాడనో క్షణాల్లోనే నిర్ణయం తీసుకుని తనువు చాలిస్తున్నారు. వీరిని ముందుగా గుర్తించడం చాలా కష్టం. వీటిని ఎమోషనల్ సూసైడ్స్ అంటారు. షార్ట్ టెంపర్ ఉన్న వ్యక్తుల్లో ఈ ప్రమాదం అధికం.

బతికి చూపించాలి..

కష్టాలు, నష్టాలు లేని వ్యక్తులు ఉండరు. విజయ శిఖరాలను అధిరోహించి ఉన్నతస్థానాల్లో ఉన్న ఎంతో మంది ఒకప్పుడు జీవితంలో కిందపడి లేచినవారేనని గుర్తించాలి. కష్టాలకు తలొగ్గి ప్రాణాలను తీసుకుంటే పిరికి చర్యగా సమాజం చూస్తుంది. అదే నిలబడి విజయం సాధిస్తే సమాజం గొప్ప వ్యక్తిగా కీర్తిస్తుంది.

పోరాడే తత్వం లేకనే...



కష్ట, నష్టాలను ఓర్చుకుని, పోరాడేతత్వం లేక ఆత్మహత్య ఆలోచనలు పెరుగుతున్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగడవడమూ కారణమే. ఈ తరహా ఆలోచనలున్న వారిని ముందుగా గుర్తించే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా చర్యలు లేకపోవడంతో బలవన్మరణాలు పెరుగుతున్నాయి. మెదడు ఫంక్షనింగ్‌లో మార్పులు, ఆత్మహత్యలను ప్రేరేపించే పరిసరాలు, వ్యక్తిగత ఇబ్బందులు కారణమవుతున్నాయి. మెదడులోని హెబున్యుల్ అనే సెన్సార్ డిసప్పాయింట్‌మెంట్, ఫెయిల్యూర్స్‌లో నెగిటివ్ థాట్స్‌ను యాక్టివ్ చేసి ఆత్మహత్యకు పురిగొల్పుతుంది.

\- డాక్టర్ ఎన్ఎన్ రాజు, మానసిక వైద్య నిపుణులు

అనేక కారణాలు



గతంతో పోలిస్తే విద్యార్థుల్లో ఆత్మహత్య ఆలోచనలు పెరుగుతున్నాయి. ఏటా 13 వేలమంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. 15 నుంచి 29 ఏళ్లలోపు వయసు వారిలో ఆత్మహత్యలు ఎక్కువ. వీటి కారణాలను గుర్తిస్తే నివారించే అవకాశం ఉంది. వర్సిటీల్లో స్టడీని పూర్తి చేసిన తరువాత కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించాలని భావిస్తున్నాం. పబ్లికేషన్స్ చేయిస్తాం. ఈ తరహా లక్షణాలున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పిస్తే మేలు జరుగుతుంది. ఇందుకోసం వర్క్‌షాప్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

\- ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ఏయూ సైకాలజీ విభాగాధిపతి

విద్యార్థుల్లో ఆత్మహత్యలకు తొమ్మిది కారణాలు

- పరిశోధన చేసిన ఏయూ సైకాలజీ విభాగం

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో విద్యార్థులు ఎక్కువ. ఇలాంటి ఆలోచనలకు కారణమవుతున్న అంశాలు తెలుసుకునేందుకు ఏయూ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయాల్లో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులపై విభాగాధిపతి ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు ఆధ్వర్యంలో 35 మంది సైకాలజీ విద్యార్థులు పరిశోధన చేశారు. సుమారు ఆరువేల మంది నుంచి సేకరించిన నమూనాలను పరిశీలించి తుది నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఇప్పటివరకు 1,200మంది ఇంజనీరింగ్, ఫార్మసీ, లా, ఆర్ట్స్ కోర్సులు చేస్తున్న వారి నుంచిసమాచారాన్ని సేకరించి అధ్యయనం చేశారు.

తొమ్మిది ఫ్యాక్టర్స్ గుర్తింపు..

విద్యార్థుల్లో ఆత్మహత్య ఆలోచనలకు తొమ్మిది ఫ్యాక్టర్స్ ఉన్నట్టు స్టడీలో గుర్తించారు. వీటిలో ఇండివిడ్యువల్ (ఆర్థిక ఇబ్బందులు, చదలేకపోతున్నానని, అందంగా లేనని, లాంగ్వేజ్ ఇబ్బందులు), హోమ్ రిలేటెడ్ ఇష్యూస్ (కుటుంబపరమైన), క్లాస్ రూమ్ స్ట్రెస్ (అకడమిక్ స్ట్రెస్, అంచనాలు అందుకోలేకపోవడం, సబ్జెక్టులు ఫెయిల్ కావడం), సెక్సువల్ ఫీలింగ్ (యుక్త వయస్కుల్లో ఉన్నప్పుడు అపోజిట్ సెక్స్‌పై ఆసక్తి పెరగడం, ప్రేమ, కాదంటారన్న భయం), ఫెయిల్యూర్ పట్ల భయం (భవిష్యత్తుపై ఆందోళన, మార్కులు, సబ్జెక్టులపై భయం), ఆత్మన్యూనతా భావం (అందంగా లేనని, పొట్టిగా ఉన్నానని, బాడీ పార్టులు పట్ల ఇబ్బంది), యాంగ్జైటీ (నిద్ర పట్టకపోడం, అరవడం, చీకటి ప్రదేశాలకు వెళ్లేందుకు భయపడడం, తీవ్రఒత్తిడి, సూసైడ్ థాట్స్ లక్షణాలు 38.2 శాతం మందిలో గుర్తించారు. 460 మంది వీటిలో ఏదో ఒక ఆలోచనతో ఉన్నారన్నారు. ఏడు నుంచి ఎనిమిది శాతం మంది ఆత్మహత్య ఆలోచనల వరకు వస్తున్నట్టు గుర్తించారు.

నక్కపల్లిలో స్టీల్ పరిశ్రమ ఏపీకి గర్వకారణం

- కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ భారీ ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో ఏఎంఎన్ఎస్ ఇండియా సీఈఓ దిలీప్ ఊమెన్, ఇతర ప్రతినిధులు మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వివరాలను కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్‌ను రెండు దశల్లో నిర్మిస్తున్నారు. మొత్తం 17.8 మిలియన్ టన్నుల వార్షిక ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. మొదటి దశలో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి, రెండో దశలో 10.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని పూర్తి చేస్తామని వారు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ఏఎంఎన్ఎస్ రూ.1,35,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీనివల్ల 55 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. మొదటి దశ ఉత్పత్తి 2029 నాటికి, రెండో దశ ఉత్పత్తి 2033 నాటికి ప్రారంభమవుతుందని కంపెనీ ప్రతినిధులు వివరించారు.

కుంగిన కల్వర్టు

... 5వ పేజీ తరువాయి

పలువురు కోరుతున్నారు. కాగా తాళ్లపాలెం వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు వేయడానికి రూ.1.7 కోట్లతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదన పెట్టారు. ముందుగా దెబ్బతిన్న వంతెనకు రసాయనాలు, సిమెంట్ కలిపిన మిశ్రమాన్ని ఉపయోగించి మరమ్మతులు చేస్తే ఎలా ఉంటుందని అధికారులు ఆలోచిస్తున్నారు. నిపుణులు వంతెనను పరిశీలించి వెళ్లారు. వంతెన శ్లాబ్‌ను జాకీలతో పైకి లేపి స్తంభాల వద్ద రసాయనాలు, సిమెంట్ మిశ్రమాన్ని నింపుతారు. త్వరలో తాళ్లపాలెం వంతెన సమస్య కూడా పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు.

కుప్పకూలిన పురాతన భవనం

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. తెల్లవారుజామున భవనం కూలిపోయి విద్యుత్ తీగలు తెగిపడడంతో పోలీస్ బీట్ కానిస్టేబుల్ ఎం.రాంబాబు గమనించి విద్యుత్ శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మునిసిపల్ అధికారుల హెచ్చరికలతో భవనం యజమాని శిథిలాలను తొలగించారు.

రైతుల సమస్యలపై వైసీపీ ఆందోళన

- ఆర్డీవోకు వినతిపత్రం అందించిన అమర్‌నాథ్ బృందం



పట్టణంలో నిరసన ప్రదర్శన చేస్తున్న వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై వైసీపీ నాయకులు మంగళవారం పట్టణంలో ఆందోళన చేపట్టారు. రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన చేస్తూ ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో షేక్ ఆయిషాకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తదితరులు వినతిపత్రం అందజేశారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తదితర సమస్యలపై వైసీపీ నాయకులు ఆర్డీవోకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత ఉంటే.. మరోవైపు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీలు డాక్టర్ బీవీ సత్యవతి, జి.మాధవి, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసీపీ నేతలు గండి రవికుమార్, ఈర్లె అనురాధ, దంతులూరి దిలీప్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్, శోభా హైమావతి, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా ఆర్డీవో కార్యాలయం లోపలకు వెళ్లడానికి పది మందికే అవకాశం కల్పించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అడిషనల్ ఎస్పీ ఎం. దేవప్రసాద్ పర్యవేక్షణలో అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి ఆధ్వర్యంలో సీఐలు టీవీ విజయ్‌కుమార్, ఎం.వెంకటనారాయణ, ఎస్ఐలు శేఖరం, సంతోష్‌కుమార్, సిబ్బంది పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు.

మావోయిస్టు లొంగుబాటు

పాడేరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొంట ఏరియా కమిటీ మావోయిస్టు పార్టీ సభ్యుడు దిరిదో దేవ మంగళవారం జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ ఎదుట లొంగిపోయాడు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన దిరిదో దేవ(34) తన 14 ఏట (2001లో) మావోయిస్టు ఉద్యమంలో చేరాడన్నారు. అంచెలంచెలుగా ఎదిగి ఏరియా కమిటీ సభ్యుడి స్థాయికి చేరుకున్నాడన్నారు. ఈ క్రమంలో 13 ఎదురుకాల్పుల ఘటనలు, రెండుచోట్ల రోడ్ల నిర్మాణానికి వినియోగించే యంత్రాలను కాల్చివేసిన ఘటనల్లో పాల్గొన్నాడని ఎస్పీ తెలిపారు. అతనిపై రెండు హత్యా నేరాలు ఉన్నాయన్నారు. ఏపీలో మావోయిస్టులకు చక్కని పునరావాసం కల్పించడంతోపాటు మావోయిస్టు పార్టీలో ఇమడలేని పరిస్థితిలో దేవ తమకు లొంగిపోయాడన్నారు. అతనిపై రూ.6 లక్షలు రికార్డు ఉందని, ఆ మొత్తం అతనికే ఇస్తున్నామన్నారు

జలమా.. గరళమా?

... 5వ పేజీ తరువాయి

నీటిని మోటార్లతో తోడించి రాంకీకి చెందిన సీఈపీటీకి తరలించారు. ఇది జరిగి పది నెలలు కాకముందే రాంకీ యాజమాన్యం వ్యర్థ జలాలను యథావిధిగా వాగులోకి విడిచిపెట్టడంతో సమస్య మళ్లీ మొదటికే వచ్చింది.

వ్యాధుల బారిన జనం

ఇప్పటికే పరవాడ మండల పరిసరాల్లోని పరవాడ, భరిణికం, తానాం, తాడి, లంకెలపాలెం, ఈ బోనంగి, సాలాపువానిపాలెంతో పాటు పలు గ్రామాల ప్రజలు ఫార్మా వ్యర్థ జలాల వలన వ్యాధుల బారిన పడుతున్నారు. పరవాడ మండలంలోని ఫార్మా సెజ్‌లో సుమారు 12 ఫార్మా పరిశ్రమలు, పరవాడ ఫార్మా సిటీలో 98 ఫార్మా పరిశ్రమలున్నాయి. వీటి నుంచి వెలువడే వ్యర్థాలకు డెవలపర్‌గా రాంకీ ఫార్మా కంపెనీని గత ప్రభుత్వం నియమించింది. ఫార్మా పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను శుద్ధి చేయాల్సిన బాధ్యత రాంకీ యాజమాన్యంపై ఉంది. ఫార్మా పరిశ్రమల నుంచి వెలువడే జల, ఘన వ్యర్థాలను బయటకు వదలకుండా తగినన్ని ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి, ల్యాండ్‌ఫీల్డ్‌లోనే నిలువరించాల్సి ఉంటుంది. కానీ రాంకీ సంస్థ యాజమాన్యం తగిన సామర్థ్యం గల ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకొనేవారే కరువయ్యారు. ఇప్పటికే పరవాడలో అందుబాటులో ఉన్న రాంకీ సంస్థకు చెందిన 18 ఎకరాల ల్యాండ్ ఫిల్ విభాగం మొత్తం ఘన వ్యర్థాలతో నిండిపోయింది. దీనిపై స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదు చేయడంతో ఇటీవల రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తనిఖీలు జరిపి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాంకీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పీసీబీ అధికారుల ఉదాసీన వైఖరిపై ఆయన మండిపడ్డారు.

బీఎన్ రోడ్డు బాగుపడేదెన్నడో?

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ప్రస్తుతం ఈ రహదారి చెరువులా మారిపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బీఎన్ రోడ్డు పనులు త్వరలో పూర్తి చేస్తామంటూ సంబంధిత కాంట్రాక్టర్ హామీలు ఇవ్వడం తప్పితే, రోడ్డు పనుల్లో ఇసుమంత పురోగతి కనిపించడం లేదు. ఈ రోడ్డు వ్యవహారంలో జిల్లా కోర్టు జోక్యం చేసుకున్నా, పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోవడంపై స్థానికులతో పాటు మూడు జిల్లాల వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 20లోగా బీఎన్ రోడ్డు పనులను ప్రయాణానికి అనువుగా తీర్చిదిద్దుతామంటూ, గత నెల 23న జిల్లా కోర్టు జడ్జి ఎదుట హాజరైన కాంట్రాక్టర్ స్పష్టంగా హామీ ఇచ్చి మంగళవారం నాటికి 16 రోజులు కావస్తున్నా, ఇప్పటికీ రోడ్డులోని ఒక్క గుంత కూడా పూడ్చకపోవడం గమనార్హం. కోర్టుకు సంబంధిత కాంట్రాక్టర్ ఇచ్చిన గడువు మరో 11 రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో ఈ పనులు పూర్తి చేయగలరా? అనే సందేహం కలుగుతోంది.స్థానిక ప్రజాప్రతినిధుల వినతులకు స్పందించక, చివరకు కోర్టులో న్యాయవాదులు వేసిన కేసులో కోర్టు అక్షింతలు వేసినప్పటికీ కాంట్రాక్టర్ లెక్కచేయకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

క్రైం... crime news

భవనం పైనుంచి దూకి వివాహిత ఆత్మహత్య



ప్రత్యూష (ఫైల్)

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మానసిక అనారోగ్య కారణాలతో భవనం పైనుంచి దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 87వ వార్డు పరిధి వడ్లపూడికి చెందిన విశ్రాంత ఉక్కు ఉద్యోగి పాకలపాటి సత్యనారాయణరాజు కుమార్తె ప్రత్యూష (38)కు 15 ఏళ్ల క్రితం అనకాపల్లి జిల్లా రాంబిల్లికి చెందిన పిన్నమరాజు సతీశ్‌తో వివాహమైంది. వీరికొక కుమారుడున్నాడు. 3 నెలల క్రితం కుమారుడి చదువు నిమిత్తం ఇక్కడకు వచ్చి కూర్మన్నపాలెంలోని అశోక్‌నగర్‌లో ఓ ఫ్లాటును అద్దెకు తీసుకున్నారు. గత తొమ్మిదేళ్లుగా ప్రత్యూష మానసిక వ్యాధి, నిద్రలేమి సమస్యలతో బాధపడుతూ మందులు వాడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దువ్వాడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రత్యూష తండ్రి సత్యనారాయణరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలోని విశాఖ డెయిరీ పాలకేంద్రం డాబాపై మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందివున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. దీనికి సంబంధించి ఏఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. పాలకేంద్రం వద్ద సాయంత్రం ఐదు గంటల సమయంలో అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి దుర్వాసన రావడంతో వారు డాబా పైకి వెళ్లి చూడగా వ్యక్తి మృతదేహం కనిపించింది. దాంతో వెంటనే వారు స్థానిక రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. రెవెన్యూ సిబ్బంది వచ్చి మృతదేహాన్ని పరిశీలించి, పోలీసులకు సమాచారం అందించారు. నాలుగు రోజుల క్రితమే ఆ వ్యక్తి మృతి చెంది ఉంటాడని, అందుకే మృతుడి ముఖం భాగం గుర్తు పట్టలేని విధంగా మారిపోయిందని ఏఎస్ఐ చెప్పారు. మృతి చెంది వున్న వ్యక్తిని స్థానికులు గుర్తించలేకపోయారన్నారు. మృతుడు ఒంటిపై తెల్లరంగుపై గళ్ల చొక్కా, మట్టిరంగు గల ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని నక్కపల్లి మార్చ్యూరీకి తరలించినట్టు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసినట్టు ఆయన తెలిపారు.

మహిళా కండక్టర్‌పై ఆటో డ్రైవర్ దాడి

పాయకరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిపిన ఆర్టీసీ బస్సు మహిళా కండక్టర్‌పై ఆటో డ్రైవర్ దాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గడచిన ఆదివారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచి ఉన్న తుని-రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్సులోకి మద్యం మత్తులో ఆటో డ్రైవరు ఎక్కాడు. దీన్ని గుర్తించిన బస్సు మహిళా కండక్టర్ ఆటో డ్రైవర్‌ని కిందికి దిగిపోవాలని చెప్పడంతో ఆమెతో ఆటో డ్రైవర్ ఘర్షణకు దిగి దాడిచేశాడు. దీనిపై బాధితురాలు పాయకరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సీఐ జి.అప్పన్న మాట్లాడుతూ మహిళా కండక్టర్‌పై దాడిచేసిన ఆటో డ్రైవర్‌ని గుర్తించామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

నక్కపల్లి ఆస్పత్రిలో మెరుగైన ఆర్థో సేవలు

- వృద్ధుడి మోకాలిలో కణితి తొలగింపు



కణితి తొలగించిన అనంతరం మోకాలుకు సర్జరీ చేసిన దృశ్యం

నక్కపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో ఆర్థో విభాగానికి సంబంధించి కొన్ని శస్త్ర చికిత్సలను ఇక్కడ చేస్తున్నారు. ఇటీవల హోం మంత్రి అనిత సిఫార్సు మేరకు ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించి అత్యాధునికమైన పరికరాలను ప్రభుత్వం అందజేసింది. ఈ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్ నిరంతరం సేవలందిస్తున్నారు. మంగళవారం ఉద్దండపురం గ్రామానికి చెందిన తుమ్మల రాజారావు (75)అనే వృద్ధుడి మోకాలిలో వున్న 100 గ్రాముల కణితిని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్ శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేయడంతో రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సింహాచలం సిరి గల్లంతు!

... 5వ పేజీ తరువాయి

మంతనాలు జరిపి ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సింహాచలం వచ్చి ఆభరణాలు తనిఖీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న అమరావతిలో నివేదిక సమర్పించారు. అందులో అనేక లోపాలు ప్రస్తావించినట్టు తెలిసింది. కొన్ని బంగారు ఆభరణాలు బరువు తగ్గినట్టు పేర్కొన్నారని, దేవస్థానానికి చెందిన ఉప ఆలయాల్లో 16 వెండి వస్తువులు గుర్తించామని, వాటి వివరాలు ఎక్కడా నమోదు చేయలేదని నివేదించినట్టు సమాచారం. కొండదిగువన పూదోటలోని వేంకటేశ్వర స్వామికి 111.38 గ్రాముల బంగారు ముత్యాల హారం ఉండాలని రిజిస్టర్‌లో నమోదుచేసి ఉండగా, ఆలయంలో 36 గ్రాముల బంగారు గొలుసు మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. అప్పన్న ఆలయ ప్రాంగణంలోని ఆభరణాల మ్యూజియంలో సుమారు 6.2 గ్రాముల బరువు గల 10 బంగారు గొలుసు ముక్కల ఆచూకీ దొరకలేదని పేర్కొన్నారు.

ఆ వెండి వస్తువులకు లెక్కల్లేవు

సింహాచలం దేవస్థానానికి 12 ఉప ఆలయాలు ఉన్నాయి. వాటికి భక్తులు దఫదఫాలుగా వివిధ రూపాల్లో 9.464 కిలోల వెండి వస్తువులు బహూమతిగా ఇచ్చారు. వాటిని అక్కడి పూజార్లు అధికారులకు అప్పగించి, రికార్డుల్లో నమోదు చేయించాల్సి ఉంది. కానీ మొత్తం 16 వెండి వస్తువులను లెక్కలు చూపించకుండా ఉంచారు. ఆయా ఆలయాల్లో వాటిని పూజాది కార్యక్రమాలకు వాడుతున్నప్పటికీ, వీటికి సంబంధించిన వివరాలు దేవస్థానానికి చెందిన రిజిస్టర్‌లో నమోదు చేయలేదనే విషయం జేవీవో గుర్తించి నివేదికలో పొందుపరిచారు. భక్తుల నుంచి కానుకలు స్వీకరించినప్పుడు రశీదులు ఇవ్వాలి. ఆ వివరాలు రిజిస్టర్‌లో నమోదుచేయాలి. కానీ దేవస్థానం అధికారులు గానీ, ఆలయ పర్యవేక్షకులు గానీ ఈ విషయాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు వెల్లడవుతున్నదని జేవీవో వ్యాఖ్యానించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీనికి కారకులైన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

చర్యలు చేపట్టకుండా కమిటీ నియామకం

జేవీఓ ఇచ్చిన నివేదిక ప్రకారం చర్యలు చేపట్టాల్సిన కమిషనర్ కార్యాలయం ఎందుకనో పునరాలోచన చేసింది. ఈ వ్యవహారంపై ఐదుగురు అధికారులతో ఒక కమిటీని ఏప్రిల్‌లో నియమించింది. చందనోత్సవం ముగిసిన వెంటనే ఆలయంలో ఆభరణాల లెక్కలన్నీ తేల్చి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అందులో మళ్లీ జేవీఓ పల్లంరాజును కూడా ఒక సభ్యుడిగా నియమించింది. వీరంతా గత నెల సింహాచలం వచ్చి కొన్ని ఆభరణాలను పరిశీలించి లెక్కించారు. ఇంకా మరికొన్ని లెక్కలు చూడాల్సి ఉంది. అయితే వైదిక కార్యక్రమాలతో బిజీగా ఉన్నందున కమిటీ వచ్చినప్పుడు ఉప ఆలయాల పూజార్లు హాజరుకాలేకపోతున్నారు. దాంతో లెక్కలు ఇంకా తేలలేదు. తొలి విచారణ జరిగి ఆరు నెలలు, కమిటీ విచారణకు ఆదేశం ఇచ్చి నాలుగు నెలలైనా ఇంకా ఏ విషయం తేల్చకుండా కాలయాపన చేస్తున్నారు. దీనిని కమిషనర్ కార్యాలయం సీరియస్‌గా తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పాలనాపరమైన తప్పులు జరుగుతున్నప్పుడు చర్యలు చేపట్టకుండా జాప్యం చేయడం మంచిది కాదని దేవదాయ శాఖ వర్గాలే చెబుతున్నాయి.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	128.00
లైవ్ ధర	148.00
విత్ స్కిన్	266.00
స్కిన్ లెస్	276.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559